RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి సంపుటి : 2 సంచిక : 80 గురువారం, ఏప్రిల్ 25, 2024 పేజీలు : 4

### ఆ మూడు ఎంపీ స్థానాలలో అభ్యర్థులు వీరే

హైదరాబాద్: తెలంగాణలో పెండింగ్ లో ఉంచిన మూడు ఎంపీ స్థానాల్లో అభ్యర్థులను కాంగ్రెస్ ప్రకటించింది. ఖమ్మం అభ్యర్థిగా రామసహాయం రఘురాంరెడ్డి, కరీంనగర్ అభ్యర్థిగా వెలిచాల రాజేందర్ రావు, హైదరాబాద్ అభ్యర్థిగా వసీఉల్లా సమీర్ పేర్లను ప్రకటించింది.

## కెసిఆర్‌ను నమ్మితే...

# నట్టేట మునిగినట్లే




హైదరాబాద్: కెసిఆర్‌ను నమ్మితే నట్టేట ముంచుడు ఖాయమని... బిడ్డకోసం సికింద్రాబాద్ సీటును తాకట్టుపెట్టి పద్మారావు పరువుతీసేందుకే పోటీకి దింపాడని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. సికింద్రాబాద్‌లో బుధవారం కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ కెసిఆర్‌ను నమ్మితే పద్మారావు నట్టేటమునిగినట్లేనని. ఈ సీటును బిడ్డకోసం బిజెపి తాకట్టు పెట్టాడని పేర్కొన్నారు. పద్మారావు నామినేషన్‌కు కెసిఆర్, కెటిఆర్ ఎందుకు రాలేదని ప్రశ్నించారు. సికింద్రాబాద్‌లో ఏ పార్టీ అభ్యర్థి గెలిస్తే... కేంద్రంలో అదే పార్టీ అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు. గత ఇరవై ఏళ్లుగా ఇదే జరుగుతోందని, మళ్లీ ఇదే పునరావృతం అవుతుందని... మహంకాళీ అమ్మవారి ఆశీస్సులతో సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ గెలుస్తోందని, దానం నాగేందర్ కేంద్రప్రభుత్వంలో కీలక బాధ్యతలు నిర్వహించబోతున్నారన్నారు. బిజెపి నాయకులు గెలిచి కేంద్ర మం త్రులైనా... హైదరాబాద్‌కు చేసింది ఏమిలేదని, వరదలు వచ్చి నగరం అతలాకుతలమైతే కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి చిల్లిగవ్వ తేలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే హిందువుల ఆస్తిని ముస్లింలకు పంచుతారని మోదీ మత విద్వేశాలను రెచ్చగొడుతున్నారని, ఒకరి ఆస్తులను ఇంకొకరికి ఎలా పంచుతారని మండిపడ్డారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసిన మోది ఇలా మాట్లాడటం సరైందికాదన్నారు. ఉద్యోగాలు, ఇండ్లు ఇస్తామని అధికారంలోకి వచ్చి బిజెపి మోసంచేసిందని దుయ్యబట్టారు. బిఆర్ఎస్‌కు ఓటేస్తే మూసిలో వేసినట్లే, బిజెపిని ఓడించాలంటే దానం నాగేందర్‌ను గెలిపించాలన్నారు. ప్రభుత్వం మనది... సంక్షేమం మనదని, ఇందిరమ్మ రాజ్యంలో పేదలకు న్యాయం చేసే బాధ్యతమాదని సీఎం హామీ ఇచ్చారు. నగరంలో మెట్రో తెచ్చింది.

## ప్రాజెక్టులపై...

# జ్యుడీషియల్ ఎంక్వైరీ

## - హైదరాబాద్ వచ్చిన మాజీ జస్టిస్

హైదరాబాద్: తెలంగాణలోని కాళేశ్వరం ప్రాజెక్ట నిర్మానంలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపేందుకు ప్రభుత్వం మాజీ న్యాయమూర్తితో ఓ కమిషన్ వేసింది. దీని కోసం రేపటి నుంచి ఆ కమిషన్ విచారణ చేపట్టనుంది. ఇందులో భాగంగా బుధవారం హైదరాబాద్‌లోని బీఆర్కే భవన్‌కు సుప్రీంకోర్టు మాజీ జస్టిస్ పినాకి ఘోష్ వచ్చారు.. కాళేశ్వరం ప్రాజెక్ట అవకతవకలపై రేపటి (గురువారం) నుంచి విచారణ ప్రారంభించనున్నారు. కాగా, కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతకలు, మేడిగడ్డ కుంగుబాటుపై జ్యుడీషియల్ ఎంక్వైరీకి రేవంత్ సర్కార్ ఆదేశించిన నేపథ్యంలో ఈ విచారణ జరగనున్నట్టు తెలుస్తోంది.



## ప్రధాని మోడీ దేశాన్ని ముక్కలు చేయాలని చూస్తున్నారు

హైదరాబాద్ : ప్రధాని నరేంద్ర మోడీ రోజుకో కొత్త మాట మాట్లాడుతున్నారని, దేశాన్ని ముక్కలు చేయాలని చూస్తునాడని సీనియర్ కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు అన్నారు. బుధవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని మొన్న మహిళల పుస్తె మట్టెలు తీసుకుంటారని అన్నాడని, ఇప్పుడు కొత్త మాట చెప్తున్నాడని ఆయన విమర్శించారు. ఇచ్చిన వాగ్దానాలు ఒక్కటన్నా అమలు చేశావా అని ఆయన ప్రశ్నించారు. అయోధ్య చెప్పుకొని ఓట్లు అడుగుతావా..? 2 కోట్ల ఉద్యోగాలు ఇచ్చినవా ? అని ప్రశ్నలు సంధించారు. ప్రజల పరిస్థితి ఎలా ఉందో పట్టించు కోరని, వారికి ,చిత్తశుద్ధి లేదని విమర్శించారు. వారికి జై శ్రీరామ్ తప్ప ఇంకొకటి లేదని, వచ్చే ఎన్నికల్లో రాహుల్ గాంధీ ప్రధాని అయితే బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని విహెచ్ చెప్పారు.




వరంగల్: తెలంగాణకు రెండో రాజధానిగా వరంగల్‌కు అన్ని అర్హతలున్నాయని రేవంత్‌రెడ్డి అన్నారు. వరంగల్‌లో బుధవారం జరిగిన కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల ప్రచార సభలో రేవంత్ మాట్లాడుతూ, భూమి బద్దలైనా అగస్ట్ 15 లోపు రుణమాఫీ చేస్తామన్నారు. రూ.2లక్షల రుణమాఫీ చేసి తీరుతామన్నారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని హరీష్ రావు అన్నారని గుర్తు చేస్తూ రాజీనామా లేఖ జేబులో పెట్టుకుని రెడీ ఉండు అని హరీష్ ను కోరారు. రామప్ప, సమ్మక్క సాక్షిగా ఇచ్చిన మాట తప్పం అని రేవంత్ అన్నారు. దళితుడిని సీఎం చేస్తానని కేసీఆర్ మోసం చేశారని.. బీఆర్ఎస్ నేతల్లా తాను తలకాయ లేని మాటలు చెప్పను అని సీఎం అన్నారు. దళితుడిని సీఎం చేస్తానని కేసీఆర్ మోసం చేశారని.. బీఆర్ఎస్ నేతల్లా తాను తలకాయ లేని మాటలు చెప్పను అని సీఎం అన్నారు. మోదీ, కేసీఆర్ ఇద్దరూ తోడుదొంగలేనని, కేసీఆర్ రాష్ట్రాన్ని ఢిల్లీలో మోదీకి తాకట్టు పెట్టారని విమర్శించారు. 'మామా, అల్లుళ్లు తోక తెగిన బల్లుల్లా ఎగురుతున్నారు. అసెంబ్లీలో మా కళ్లలో చూసే ధైర్యం లేక కేసీఆర్ పారిపోయాడు. కేసీఆర్ అసెంబ్లీకి రాడు. మాతో చర్చకు రమ్మంటే పారిపోతాడు. కేసీఆర్ చచ్చిన పాము. కాళేశ్వరం అద్భుతంగా కట్టి ఉంటే కేసీఆర్ నాతో చర్చకు రావాలి. ప్రాజెక్టు వద్దే చర్చకు రావాలి.

## కనీసం నా అంత్యక్రియలకైనా రండి



బెంగళూరు : "మీకోసం పనిచేయలేదని మీరు భావిస్తే కనీసం నా అంత్యక్రియలకైనా రండి" అని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే భావోద్వేగంతో ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కర్ణాటక లోని తన స్వంత కాలబురిగి జిల్లా లోని అఫ్జల్‌పూర్‌లో బుధవారం ఎన్నికల ర్యాలీలో ప్రసంగిస్తూ భావోద్వేగానికి గురయ్యారు. కాలబురిగి నియోజక వర్గం నుంచి ఖర్గే అల్లుడు రాధాకృష్ణ దొడ్డమాని కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తుండగా, సిటింగ్ ఎంపి ఉమేష్ జాదవ్ బీజేపీ అభ్యర్థిగా పోటీ ఇస్తున్నారు. " మీరు ఈసారి కాంగ్రెస్ అభ్యర్థికి ఓటేయకుంటే ఇక్కడ నాకింక ఎలాంటి చోటు లేదని భావిస్తాను. ఇక మీ హృదయాలను సాధించలేను. మీరు కాంగ్రెస్‌కు ఓటేసినా, వెయ్యికపోయినా, కాలబురిగికి ఏదైనా చేశానని భావిస్తే కనీసం నా అంత్యక్రియలకైనా రండి." అని ఆయన ప్రజలను వేడుకున్నారు. బీజేపీని, ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని ఓడించడానికి తన ఆఖరి శ్వాసవరకు రాజకీయాల్లో కొనసాగుతానని ఖర్గే స్పష్టం చేశారు.

## ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా... రామసహాయం రఘురాంరెడ్డి



హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల రాజకీయ వర్గాలు ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తున్న ఖమ్మం, కరీంనగర్, హైదరాబాద్ లోక్‌సభ స్థానాలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించింది. ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా రామసహాయం రఘురాంరెడ్డి పేరుని ప్రకటించింది. కరీంనగర్ అభ్యర్థిగా వెలిచల రాజేందర్ రావు, హైదరాబాద్ ఎంపీ అభ్యర్థిగా మహ్మద్ వలీవుల్లా సమీర్ పేర్లను ప్రకటించింది. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వియ్యంకుడే రఘురామి రెడ్డి. అంతేకాదు తెలుగు సినీ హీరో విక్టరీ వెంకటేశ్ కూడా ఈయనకు వియ్యంకుడే. ఖమ్మం లోక్‌సభ స్థానాన్ని ఆనుకొని ఉన్న మహబూబాబాద్ లోక్‌సభ స్థానానికి రఘురామి రెడ్డి తండ్రి సురేందర్ రెడ్డి ఏకంగా నాలుగుసార్లు ఎంపీగా ప్రాతినిధ్యం వహించారు. దీంతో ఆయనకు రాజకీయ పలుకుబడి గట్టిగానే ఉంది. ఆర్థికంగా ఆయన బలవంతుడే కావడంతో కాంగ్రెస్ పార్టీ ఆయనవైపు మొగ్గుచూపిందట. తన సోదరుడు ప్రసాద్ రెడ్డికి కాకుంటే వియ్యంకుడు రఘురామి రెడ్డికి ఇవ్వాలంటూ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎత్తుగడలు వేశారనే చర్చ కూడా రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. పొంగులేటి కుటుంబ సభ్యులకు టికెట్ రాకుండా సీఎం రేవంత్‌రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రయత్నించినట్టు కూడా కథనాలు వెలువడ్డాయి. ఏదేమైనప్పటికీ చివరి రఘురామి రెడ్డి పేరు మాత్రం ఖరారయ్యిందనే ప్రచారం మాత్రం జోరుగా సాగుతోంది. కాగా ఏకంగా ముగ్గురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లా కావడంతో ఖమ్మం సీటును ఆలస్యంగా ప్రకటించినా ఏమీ కాదనే ఉద్దేశ్యంతో పార్టీ ఈ సీటు అభ్యర్థి విషయంలో తాత్సారం చేస్తున్నట్లు రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## దేశానికి టెక్నాలజీని అందించిన...

# మహానేత రాజీవ్ గాంధీ

## : జగ్గారెడ్డి

హైదరాబాద్ : దేశానికి టెక్నాలజీని అందించిన గొప్ప నేత రాజీవ్ గాంధీ అని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. బుధవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ 70 ఏళ్లలో ఏం చేశారని అడిగే కెటిఆర్, హరీష్ , బిజెపి నేతలు విషయం తెలుసుకోవాలని సూచించారు. త్యాగం, దేశ భక్తి కలిగిన నేత రాజీవ్ గాంధీ అని ఆయన కొనియాడారు. టెలికమ్యూనికేషన్స్ ని ప్రజలకు అందించిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కుతుందన్నారు. ప్రదాని మోడీ, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్



వాడుతున్న టెక్నాలజీ అంతా రాజీవ్ గాంధీ తెచ్చిందేనని ఆయనన్నారు. జైల్లో ఉన్న బిడ్డతో కెసిఆర్ మాట్లాడుతున్నది కూడా రాజీవ్ గాంధీ తెచ్చిన టెక్నాలజీ తోనేనని, హైటెక్ సిటీకి పునాది రాజీవ్ ఆలోచనలేనని ఆయనన్నారు. రాజీవ్ గాంధీ ఎప్పుడూ ప్రధాని లా కాకుండా ఒక ఎంప్లాయి గా పని చేశారని, ప్రజల సమస్యలపై అవగాహన ఉన్న నాయకుడు రాజీవ్ గాంధీ అని తెలిపారు. రాజీవ్ గాంధీ టెలికమ్యూనికేషన్స్ ని తెచ్చారు, ఆయన ఐటీ కి పునాది వేసిన తరవతే నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి హైటెక్ సిటీకి పునాది వేశారని తెలిపారు. మీ చేతుల్లోనే రాజీవ్ గాంధీ ఉన్నాడని, గాంధీ కుటుంబం గురించి మాట్లాడేటప్పుడు ఆలోచించి మాట్లాడాలని సూచించారు. ఓటు ద్వారా ఎన్నికల వ్యవస్థ నెహ్రూ తెస్తే, 18 ఏండ్లు నిండిన యువత కి ఓటు హక్కు కల్పించింది రాజీవ్ గాంధీ అని తెలిపారు. మోడీ తెచ్చిందేమి లేదనే విషయం యువత ఆలోచించాలన్నారు. దేశానికి శాంతి సందేశం ఇచ్చింది రాజీవ్ గాంధీ అని, శ్రీలంక పై ఎల్‌టిసి దాడులను కాపాడింది రాజీవ్ గాంధీ అని ఆ కుట్ర తోనే రాజీవ్ గాంధీని ఎల్‌టిటి పొట్టన పెట్టుకున్నారని జగ్గారెడ్డి తెలిపారు.

# వాస్తవ సమస్యలు మాట్లాడని మోడీ

వయనాడ్(కేరళ): బిజెపి పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, ఎన్నికల ప్రచారంలో సైతం ప్రజల దృష్టిని వాస్తవ సమస్యల నుంచి మళ్లించడానికి ప్రధాని నరేంద్ర మోడీ, బిజెపి నాయకులు ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా బుధవారం ఆరోపించారు. తన సోదరుడు రాహుల్ గాంధీ పోటీ చేస్తున్న కేరళలోని వయనాడ్ నియోజకవర్గంలో ఆమె ఎన్నికల ప్రచార సభలో ప్రసంగిస్తూ ధరల పెరుగుదల, నిరుద్యోగిత వంటి సమస్యలను పరిష్కరించడంలో మోడీ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి లోక్‌సభ ఎన్నికలు గొప్ప అవకాశమని ఆమె తెలిపారు. గత పదేళ్ల బిజెపి పాలనలో పెట్రోల్, డీజిల్, ఇతర నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని ఆమె తెలిపారు. అదే విధంగా నిరుద్యోగ సమస్య పెరిగిందని ఆమె చెప్పారు. అయితే ప్రధాని మోడీ, బిజెపి నాయకులకు ఈ సమస్యలు పట్టవని ఆమె విమర్శించారు. అభివృద్ధి గురించి, వాస్తవ సమస్యల



గురించి వారు మాట్లాడరని ఆమె అన్నారు. ప్రజల జీవితాలకు సంబంధం లేని కొత్త అంశాలను వారు తెరపైకి తెస్తుంటారని ఆమె విమర్శించారు.

## సంపాదకీయం

# ఎండలు – ఎన్నికలు

ఎండలు మండిపోతాయి జాగ్రత్త అంటూ భారతవాతావరణశాఖ గట్టిగా హెచ్చరించడం ఇటీవలి సంవత్సరాల్లో మరీ ఎక్కువైంది. పదేళ్ళుగా దేశంలో ఎండల తీవ్రత పెరిగిందట. ఐఎండీ హెచ్చరికలకంటే ముందుగానే సూర్యుడు తన ఉగ్రరూపాన్ని ప్రదర్శించడం మొదలెట్టేస్తున్నాడు. ఫిబ్రవరి చివర్లోనే వేడి తగలడం మొదలైపోతోంది. ఈ ఏడాది ఇప్పటికే నమోదవుతున్న ఉష్ణోగ్రతలను బట్టి రాబోయే రోజులు ఎలా ఉంటాయన్న భయం కలుగుతోంది. నీటి కొరతసహా వేసవి అనుభవం అప్పుడే పలు రీతుల్లో కనిపిస్తోంది. గత ఏడాదికంటే ఈ వేసవి మరింత తీవ్రంగా ఉంటుందని, మరిన్ని వడగాడ్పులు పడాల్సివస్తుందని ఐఎండీ అంటోంది. భూగర్భజలాలు వేగంగా అడుగంటుతున్నాయి, జలాశయాలు ఎండిపోతున్నాయి. ఉష్ణోగ్రతల పెరుగుదల మీదే కాక, వర్షపాతాన్ని ప్రమాదకరమైన స్థాయిలోకి తగ్గించే శక్తి ఎల్‌నినోకు ఉన్నది. గత ఏడాది రుతుపవనాల ప్రవేశంలో జాప్యం, ఓ మూడునెలలు వర్షాలు మెరుగ్గానే పడినా ఆ తరువాత వాటిజాడలేకుండా పోవడంతో నీటిసమస్యకు అప్పట్లోనే బీజాలుపడ్డాయి. రాబోయే కాలంలో వడగాడ్పులు సంఖ్యరీత్యా, విస్తృతి రీత్యా రెట్టింపవుతాయని ఐఎండీ అంటోంది. చెప్పినట్టుగానే తెలుగురాష్ట్రాలతో సహా దేశంలోని చాలా రాష్ట్రాలు గరిష్ఠ ఉష్ణోగ్రతలతో గడగడలాడిపోతున్నాయి. ఎండలు, వడగాడ్పులకు తోడుగా నీరు కూడా కరువైతే ప్రజలు అల్లాడిపోతారు, పశుపక్ష్యాదులు ప్రాణంవదిలేస్తాయి. ముంచుకొస్తున్న గడ్డుకాలాన్ని దాటడానికి ప్రభుత్వాలు ప్రతీ అడుగూ అతిజాగ్రత్తగా వేయాల్సి ఉంటుంది. నీటి వనరులను సమర్థంగా నిర్వహించడంతోపాటు, ఉద్యోగ, ఉపాధి రీత్యా ఎండల్లో విధిగా పనిచేయాల్సి వచ్చే ఆయా రంగాల ప్రజలను దృష్టిలో పెట్టుకోవాలి. కార్మికుల శ్రేయస్సును ఖాతరుచేయని సంస్థలు, పరిశ్రమలు మనదగ్గర చాలా ఉన్నాయి. అందువల్ల, తగినంత మంచి నీరు, నీడపట్టున ఎక్కువ సమయం విశ్రాంతి, తక్షణచికిత్స, ఆస్పత్రులకు తరలింపు తదితర విషయాల్లో అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించమంటూ ప్రభుత్వం నుంచి విస్పష్టమైన ఆదేశాలు జారీకావాలి. నిర్మాణరంగంలో పనిచేసేవారిపైనా, ఉపాధిహామీ కూలీలపైనా ప్రత్యేక దృష్టిపెట్టాలి. అధిక ఉష్ణోగ్రతల ప్రభావంతో తీవ్ర అనారోగ్యాలకు గురికావడం జరుగుతుంది కనుక మందులకు, వైద్యసహాయానికి లోటులేకుండా చూసుకోవాలి. వడగాడ్పులను ప్రకృతివైపరీత్యాలుగా పరిగణించకపోవడం, వడదెబ్బ మరణాలకు నష్టపరిహారాలు అందకపోవడం సరికాదు. ఈ అమానవీయమైన ధోరణిని మనం సరిదిద్దుకోవాల్సి ఉంది. ఈ ఏడాది తీవ్ర ఎండలకు సార్వత్రిక ఎన్నికలు కూడా తోడవుతున్నాయి. ఎన్నికల ప్రచారం యావత్తూ భయంకరమైన వేడిమిలో సాగాల్సి వస్తున్నది. వేడితో పాటే ప్రచార ఉధృతీ పెరుగుతుంది. లక్షలాదిమంది సామాన్యులు సభలూ సమావేశాల్లో పాల్గొంటారు, అభ్యర్థుల తరఫున ప్రచారం చేస్తారు. ఎండలు భగభగలాడుతూ, వడగాడ్పులు వీచేకాలంలో వరుసబెట్టి జరిగే ఈ రాజకీయ సదస్సులు, ర్యాలీలు అనేకమంది ఆరోగ్యాన్ని దెబ్బతీసి, వారి ప్రాణాలను ప్రమాదంలో పడవేసే అవకాశం ఉంది. మహారాష్ట్రలో గత ఏడాది సరిగ్గా ఇదే కాలంలో జరిగిన ఓ రాజకీయ సదస్సు పదమూడుమంది ప్రాణాలు తీసింది, వందలాదిమందిని ఆస్పత్రిపాల్జేసింది. నావీముంబైలో ఒక సామాజిక కార్యకర్తకు ఏదో పురస్కారాన్ని ఇచ్చేందుకు ఉద్దేశించిన ఈ సభను మండుటెండలో నిర్వహించడమే కాక, వచ్చినవారంతా ఎండకు ఎదురొడ్డి నిలిచిన ధీరులు, శూరులని మరీ నాయకులు పొగిడారు. అమిత్ షా సహా కొందరు కేంద్రమంత్రులు, రాష్ట్ర ముఖ్య, ఉపముఖ్యమంత్రులు నీడపట్టున, చల్లగాలిలో గద్దెమీద ఉంటే, పదిలక్షలమంది ప్రజలు మండుటెండలో మాడిపోయారు. అందుబాటులో ఉన్న మంచినీరంతా ఎండవేడికి మరిగిపోయింది. జనం అల్లాడిపోతూ, కుప్పకూలిపోతున్న స్థితిలో చల్లని నీళ్ళకోసం పోలీసులు అటూఇటూ పరుగులుతీయాల్సి వచ్చింది. ఏర్పాట్లు ఎంత నాసిగా ఉన్నాయంటే, సొమ్మసిల్లినవారిని ఆస్పత్రులకు తరలించడానికి పోలీసులు మోటార్‌సైకిళ్ళను వినియోగించాల్సి వచ్చింది. ఇది పాలకులు చేజేతులా సృష్టించిన విపత్తు. పేదల ప్రాణాలమీద పాలకులకు ఎంతశ్రద్ధ ఉంటుందో ఈ ఘటన తెలియచెబుతోంది. సార్వత్రిక ఎన్నికలు, మండుటెండలు ఒకదానితో ఒకటి పెనవేసుకున్న ఈ కాలాన్ని ఎటువంటి ప్రమాదాలు జరగకుండా దాటించాల్సిన బాధ్యత అన్ని రాజకీయ పార్టీలమీదా ఉంది. ఐఎండీ హెచ్చరికలకంటే ముందుగానే సూర్యుడు తన ఉగ్రరూపాన్ని ప్రదర్శించడం మొదలెట్టేస్తున్నాడు. ఫిబ్రవరి చివర్లోనే వేడి తగలడం మొదలైపోతోంది. ఈ ఏడాది ఇప్పటికే నమోదవుతున్న ఉష్ణోగ్రతలను బట్టి రాబోయే రోజులు ఎలా ఉంటాయన్న భయం కలుగుతోంది. నీటి కొరతసహా వేసవి అనుభవం అప్పుడే పలు రీతుల్లో కనిపిస్తోంది. గత ఏడాదికంటే ఈ వేసవి మరింత తీవ్రంగా ఉంటుందని, మరిన్ని వడగాడ్పులు పడాల్సివస్తుందని ఐఎండీ అంటోంది. భూగర్భజలాలు వేగంగా అడుగంటుతున్నాయి, జలాశయాలు ఎండిపోతున్నాయి. ఉష్ణోగ్రతల పెరుగుదల మీదే కాక, వర్షపాతాన్ని ప్రమాదకరమైన స్థాయిలోకి తగ్గించే శక్తి ఎల్‌నినోకు ఉన్నది.

# మాజీ సర్పంచ్ రామరాజు యాదవ్ గ్రామ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగారు



**శామీర్ పేట, (గరుడ వార్త) :** గ్రామ అభివృద్ధి లక్ష్యంగా మాజీ సర్పంచ్ రామరాజు యాదవ్ ముందుకు సాగేవారని పలువురు నాయకులు అన్నారు. బుధవారం మండల కేంద్రం శామీర్ పేట లో ఆయన కుమారుడు, మాజీ సర్పంచ్ కిషోర్ యాదవ్ నివాసంలో రామరాజు యాదవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా 16వ వర్ధంతి వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి వివిధ పార్టీల నాయకులు విచ్చేసి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ గ్రామానికి మాజీ సర్పంచ్ ఎనలేని సేవలు అందించారని తెలిపారు. రామరాజు యాదవ్ రెండు పర్యాయాలు సర్పంచ్ గా బాధ్యతలు నిర్వహించి గ్రామ అభివృద్ధికి కృషి చేశారని చెప్పారు. శామీర్ పేట పెద్దమ్మ కాలనీ ఇళ్ల స్థలాలు అందజేయడానికి ఎంతగానో పాటుపడి ఆనాటి మంత్రి దేవేందర్ గౌడ్ చేతిలో మీదుగా పేదలకు పట్టాలను అందించిన ఘనత ఆయనకే దక్కుతుంది అన్నారు. గ్రామానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు సాయిబాబు, వివిధ పార్టీల నాయకులు ముజీబుద్దిన్ వైఎస్ గౌడ్ అశోక్ ఆనంద్ గౌడ్ మైసయ్య నరేష్ గౌడ్ ఆంజనేయులు శ్రీకాంత్ గౌడ్ నరసింహారెడ్డి అఫ్జల్ ఖాన్ రవీందర్ భాస్కర్ గౌడ్ వెంకటేష్ రమేష్ శ్రీనివాస్ యాదవ్ కుమార్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# 38 నామినేషన్లు దాఖలు అయ్యాయి

## – మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ గౌతమ్



**మల్కాజిగిరి:** పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ లో భాగంగా మల్కాజిగిరి లోక్ సభ నియోజకవర్గ స్థానానికి బుధవారం రోజున అత్యధికంగా 38 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయడం జరిగిందని మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. నామినేషన్ల క్రతువు సాఫీగా సాగేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ గౌతం పర్యవేక్షణలో జిల్లా యంత్రాంగం నిర్వహిస్తుండడంతో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో నామినేషన్ల క్రతువు ప్రశాంతంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సాఫీగా కొనసాగుతోంది.


# హనుమాన్ జయంతి పురస్కరించుకొని శోభాయాత్ర





**శామీర్ పేట, (గరుడ వార్త):** ఉమ్మడి మండలంలో హనుమాన్ జయంతి పురస్కరించుకొని ఘనంగా శోభాయాత్ర నిర్వహించారు. ఉమ్మడి శామీర్ పేట మండలంలో హనుమాన్ జయంతి సందర్భంగా మంగళవారం రాత్రి ర్యాలీలు నిర్వహించి పూజలు చేశారు. మండల కేంద్రం శామీర్ పేట లో రామాలయం వద్ద బిజెపి నాయకులు హనుమాన్ మాల ధారణ భక్తులు ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేస్ని హనుమాన్ జయంతి వేడుకలను జరుపుకున్నారు. తూముకుంట లో రామసేన ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించగా యువకులు భక్తుల పెద్ద ఎత్తున పాల్గొన్నారు. జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తూ శోభయాత్ర జరిపారు. మాజీ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్ శోబయాత్రలో పాల్గొన్నారు. ఆయా గ్రామాల యువకులు, భక్తులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద తమిళనాడు రైతుల నిరసన



న్యూఢిల్లీ : పంటలకు మద్దతు ధర కోరుతూ తమిళనాడుకు చెందిన రైతులు బుధవారం ఢిల్లీ లోని జంతర్‌మంతర్ వద్ద నిరసనకు దిగారు. ఈ సందర్భంగా ఆత్మహత్య చేసుకున్న రైతుల కపాలాలు, ఎముకలతో నిరసన తెలియజేశారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని 2019లో మోడీ ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, ఇప్పటివరకు అమలు చేయలేదని రైతులు మండి పడ్డారు. నదుల అనుసంధానం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కొందరు రైతులు చెట్లెక్కి, మరికొందరు మొబైల్ టవర్ ఎక్కి నిరసన తెలియజేశారు. తమ డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకుంటే వారణాసిలో మోడీకి వ్యతిరేకంగా పోటీ చేస్తామని హెచ్చరించారు. దీనిపై డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (న్యూఢిల్లీ ) దేవేష్ కుమార్ మహ్లా మాట్లాడుతూ దాదాపు 50 మంది రైతులు తమిళనాడు నుంచి వచ్చి నిరసన తెలిపారని, వీరిలో ఇద్దరు మొబైల్ టవర్ ఎక్కి ఆందోళన చేయగా వారిని కిందకు దించివేయడమైందని చెప్పారు. మరికొందరు చెట్లు ఎక్కడానికి ప్రయత్నించారన్నారు. అయితే ఆందోళనలో దాదాపు 100 మంది రైతులు పాల్గొన్నారు. వ్యవసాయం ద్వారా రెట్టింపు ఆదాయం కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తాము డిమాండ్ చేస్తున్నట్టు తమిళనాడు రైతులు చెప్పారు. అలాగే రూ.5000 వరకు పెన్షన్, వ్యక్తిగత బీమా, నదులను అనుసంధానం చేయడం తదితర డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. రైతులు నిరసన తెలుపుతున్నారని తమకు పిలుపు రాగానే జంతర్‌మంతర్ వద్దకు స్కై లిఫ్ట్‌తో వెళ్లామని, మొబైల్ టవర్ నుంచి రైతులను కిందకు దించామని ఢిల్లీ ఫైర్ సర్వీస్ (డిఎఫ్ఎస్) సీనియర్ అధికారి తెలిపారు.

# 90 శాతం జనాభాకు న్యాయం దక్కడమే నా జీవితాశయం



- కులగణన అంటే మోడీ భయపడుతున్నారు
- ఓబిసినని చెప్పుకుని ఇప్పుడు కులమే లేదంటున్నారు
- కాంగ్రెస్ మేనిఫెస్టో విప్లవాత్మకం
- సంపన్నులతో సమానంగా బడుగులకూ సాయం
- అధికారంలోకి వచ్చాక కులగణనకే తొలి ప్రాధాన్యం
- ప్రధాని మోడీ ఆరోపణలకు రాహుల్ గాంధీ కౌంటర్

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోపై ప్రధాని నరేంద్ర మోడీ చేస్తున్న ఆరోపణలకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బుధవారం ఘాటుగా జవాబిచ్చారు. ఇది రాజకీయ సమస్య కాదని, దేశ జనాభాలో 90 శాతం ఉన్న బడుగు వర్గాలకు న్యాయం చేయడమే తన జీవితాశయమని రాహుల్ ప్రకటించారు. దేశ భక్తులమని తమను తాము చెప్పుకుంటున్న వారు కుల గణన ద్వారా దేశానికి ఎక్స్‌రే తీస్తామంటే భయపడిపోతున్నారని రాహుల్ విమర్శించారు. బుధవారం నాడిక్కడ సమృద్ధ భారత్ ఫౌండేషన్ నిర్వహించిన సామాజిక్ న్యాయ్ సమ్మేళన్‌లో రాహుల్ ప్రసంగిస్తూ అయోధ్య రామాలయ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవంలో కాని పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవంలో కాని ఒక్క దళితుడు కాని గిరిజనుడు కాని ఓబిసి వ్యక్తి కాని కనిపించలేదని, పార్లమెంట్ భవన ప్రారంభోత్సవానికి దేశానికే తొలి ఆదివాసీ రాష్ట్రపతి అయిన ద్రౌపది ముర్ముకు ఆహ్వానం కూడా లేదని చెప్పారు. కాంగ్రెస్ మేనిఫెస్టోపై ప్రధాని ఆరోపణలను తిప్పికొడుతూ అది విప్లవాత్మకమైన మేనిఫెస్టోగా ఆయన అభివర్ణించారు. తమ మేనిఫెస్టో చూసి ప్రధాని మోడీ భయకంపితులయ్యారని ఆయన వ్యాఖ్యానించారు. గత పదేళ్లగా తాను ఓబిసినంటూ ప్రతిఒక్కరికి చెప్పుకుంటున్న మోడీ తాను కుల గణన గురించి మాట్లాడడం ప్రారంభించగానే అసలు కులమే లేదంటూ మాట్లాడుతున్నారని రాహుల్ ఎద్దేవా చేశారు. అసలు కులమే లేకపోతే నేను ఓబిసిని అంటూ ఎందుకు చెప్పుకున్నారని ప్రధాని మోడీని రాహుల్ నిలదీశారు. ఆ తర్వాత పేద, ధనిక అనే రెండే కులాలు ఉన్నాయంటూ మోడీ చెప్పడం ప్రారంభించారని, ఆయన మాటలే నిజమైతే పేదలను లెక్కిద్దామని, 90 శాతం పేదలు దళితులు, ఆదివాసీలు, ఓబిసిలే ఉంటారని రాహుల్ చెప్పారు. సంపన్నులలో ఈ కులాల వారు మీకు కనపడరని ఆయన అన్నారు. తనకు ఇది రాజకీయ సమస్య కాదని, ఇది తనకు జీవితాశయమని రాహుల్ చెప్పారు. రాజకీయ సమస్యలకు, జీవాతాశయానికి చాలా తేడా ఉంటుందని, రాజకీయాలలో రాజీపడడాలు ఉంటాయి కాని జీవితాశయాలలో ఉండవని ఆయన అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ సారథ్యంలో ప్రభుత్వం ఏర్పడిన వెంటనే తమ ప్రథమ ఎజెండా కులగణనేనని ఆయన ప్రకటించారు. దేశంలోని మీడియా, న్యాయ వ్యవస్థ, ప్రైవేట్ ఆసుపత్రులు, బడా కంపెనీలు వంటి రంగాలలో దళితులు, ఆదివాసీలు, ఓబిసిల ఉనికి చాలా తక్కుగా ఉందని ఆయన తెలిపారు.నాకు కులాల పట్ల ఆసక్తి లేదు. నాకు న్యాయం అంటేనే ఆసక్తి. నేడు దేశంలోని 90 శాతం మందికి అన్యాయం జరుగుతోంది. న్యాయం జరగాలని నేను మాట్లాడిన ప్రతిసారి దేశంలో చీలికలు తేవడానికి ప్రయత్నిస్తున్నారంటూ ప్రతి ఒక్కరూ మాట్లాడుతున్నారు. భారతదేశానికి మంచి జరగాలని దేశభక్తి ఉన్న ప్రతిఒక్కరూ కోరుకుంటారు. అందు కోసం 90 శాతం జనాభా శక్తిని మనం వినియోగించుకోవాలి. తమను తాము దేశభక్తులమని చెప్పుకుంటున్న వారు ఎక్స్‌రే అంటే భయపడిపోతున్నారు అంటూ రాహుల్ వ్యాఖ్యానించారు. తన ఆర్థిక ఎజెండాను ఆయన వివరిస్తూ బడా వ్యాపార సంస్థలకు సాయం చేయకూడదని లేదా ప్రోత్సహించకూడదని తాను చెప్పడం లేదని, వారికి రూ. 100 ఇస్తే దేశంలోని 90 శాతం జనాభాకు కూడా అంతే మొత్తాన్ని ఇవ్వాలని తాను చెబుతున్నానని రాహుల్ చెప్పారు. కనీసం ఇందు కోసం చర్యలు తీసుకుంటామని కూడా వారి నోటి నుంచి రావడం లేదని ఆయన బిజెపి ప్రభుత్వాన్ని విమర్శించారు. దేశంలోని బడుగు వర్గాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆమడ దూరంలో ఉంచుతోందని ఆయన ఆరోపించారు. అయోధ్యలో రామాలయం ప్రాంరభించినపుడు నేను మిమిల్ని(దళితులు, ఆదివాసీలు, ఓబిసిలు) చూడలేదు. పార్లమెంట్ భవనం ప్రారంభించినపుడు ఆదివాసీ మహిళ అయిన రాష్ట్ర ద్రౌపది ముర్మ అక్కడ లేరు. దీన్ని బట్టి అర్థమవుతున్నదేమిటంటే అధికారాన్ని పంచుకోవాల్సి వచ్చినపుడు మీకు అక్కడ స్థానం ఉండదు.

## కోనాయిపల్లి ఆలయంలో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామి రెడ్డి పూజలు వెంకట్రామిరెడ్డి



**మెదక్:** కోనాయిపల్లి వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ఘన విజయం సాధిస్తానని మెదక్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి అన్నారు. బుధవారం నాడు అయన కోనాయిపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. వెంక్రటామిరెడ్డి మాట్లాడుతూ ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తానని వెంకటేశ్వరస్వామిపై ప్రమాణం చేసి చెబుతున్నా. పేద విద్యార్థులకు చదువుకు ట్రస్టు ద్వారా సహకారం అందిస్తా. ఫంక్షన్ హాల్ ద్వారా ఒక్క రూపాయికే శుభకార్యాలకు ఇవ్వడం జరిగుతుంది. నేను ఎప్పుడూ సేవకున్నేనని అన్నారు.

## వాకర్స్ తో వినోద్ కుమార్ ప్రచారం



**సిరిసిల్ల:** వేములవాడ మండల పరిషత్ కార్యాలయంలో బిఅర్ఎస్ ఎంపి అభ్యర్థి బోయిని పల్లి వినోద్ కుమార్ మార్నింగ్ వాక్ చేసారు. ఈ మార్నింగ్ వాక్ లో చల్మెడ లక్ష్మీ నరసింహ రావు, సీనియర్ నేత ఏనుగు మనోహర్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గోన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో తనకి ఓటు వేయాలని, కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీల అవలంబిస్తున్న తీరు పై వాకర్స్ తో వినోద్ కుమార్ వివరించారు. బీజేపీ హిందుత్వం అనే పేరు తో రాజకీయం, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెర వేర్చలేదు, రెండు పార్టీలకు బుద్ధి చెప్పాలని విజ్ఞప్తి చేసారు.

## మలక్ పేటలో ఎంఐఎం ప్రచారం పాల్గోన్న ఎమ్మెల్యే బలాల



**హైదరాబాద్:** హైదరాబాద్ పార్లిమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మలక్ పేట నియోజికవర్గం లో అక్బర్ బాగ్ డివిజన్, నల్లగొండ ఎక్స్ రోడ్, కలాడేరా, తదితర ప్రాంతాల్లో ఎంఐఎం అభ్యర్థి అసద్ ఉద్దీన్ ఒవైసీ తరపున ఎమ్మెల్యే అహ్మద్ బాలల ప్రచారం నిర్వహించారు. పెద్ద ఎత్తున్న ఎంఐఎం కార్యకర్తలు ప్రచారం లో పాల్గొని పతంగి గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు......

## ఆర్టీసీ కండక్టర్ బ్యాగ్ నుంచి నగదు చోరీ



**మేడ్చల్:** గుర్తుతెలియని వ్యక్తులు ఆర్టీసీ బస్ కండక్టర్ బ్యాగ్ నుంచి నగదు అపహరించిన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మేడ్చల్ పోలీస్ తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు(బిబ 03ళి0322) మంగళవారం సాయంత్రం 6 గంటలకు రామాయంపేట నుండి సికింద్రాబాద్ కు బయలుదేరింది. రాత్రి 8 గంటల సమయంలో దాదాపు 90 మంది ప్రయాణికులతో బస్ మేడ్చల్ చేరుకుంది. అప్పటికే బస్ కండక్టర్ సాయికుమార్ బ్యాగ్ లో 10వేల రూపాయలు కనిపించకపోవడంతో మేడ్చల్ డిపోలో బస్ ఆపి ప్రయాణికుల తనిఖీ చేయగా ఎవరి దగ్గర నగదు లభించలేదు. దీంతో డ్రైవర్ బాబు కండక్టర్ సాయికుమార్ మేడ్చల్ పోలీసుల ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**మేడ్చల్:** ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధి హైదరాబాద్ వరంగల్ జాతీయ రహదారి ఉప్పల్ చెరువు కట్టపై రోడ్డు ప్రమాదం జరిగింది.ఘటనలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. యువకుడి ద్విచక్ర వాహనం స్కిడ్ అయి రోడ్డుపై పడిపోగా వెనుక నుండి వస్తున్న ఆర్టీసీ బస్సు యువకుడి తలపై నుండి వెళ్లడంతో యువకుడు అక్కడికక్కడే మృ చెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుని వివరాలు తెలియాల్సి ఉంది.

# అవినీతి పురాణం, గురివింద కచేరీ..!



కుమార్తె కవిత అరెస్టయినప్పుడు, కేసీఆర్ ఎందుకు వెంటనే స్పందించలేకపోయారు? కేజ్రీవాల్ అరెస్టును ఖండించినప్పుడు మాత్రమే కవిత పేరు కూడా చేర్చి ఎందుకు మాట్లాడారు? ఆమె అరెస్టయినప్పుడు, కుటుంబసభ్యులు, పార్టీ నాయకులు ఈడీ అధికారులతో వాదనలు చేశారు తప్ప, అదంతా అన్యాయమని గట్టిగా జనం ముందు ఎందుకు అనలేకపోయారు? మద్యం కుంభకోణంలో కల్వకుంట్ల కవిత ప్రమేయం, ఏమంత గర్వకారణమైన అంశం కాదన్న సంకోచం ఏదైనా కేసిఆర్, ఇతర బీఆర్ఎస్ నేతల మనసులను ఆవరించిందా? ఒక కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేస్తే వేలకొలది కేజ్రీవాల్‌లు పుట్టుకవస్తారని, అరవింద్ ఒక మనిషి కాదు, ఒక భావన అని ఆమ్ ఆద్మీపార్టీ ఎట్లా గట్టిగా అనగలుగుతోంది? దేశంకోసమే నా జీవితం అంటూ కేజ్రీవాల్ జైలు నుంచి పంపిన సందేశాన్ని ఆయన భార్య ఎట్లా సగర్వంగా దేశం ముందు చదవగలిగింది? పై ప్రశ్నలు, ఒకే కేసులో అరెస్టయిన ఇద్దరిలో ఒకరు నైతికంగా ఎక్కువ, మరొకరు తక్కువ అని చెప్పడం కోసం కాదు. రెండు రాజకీయ సంస్థల ప్రతిస్పందనల్లో ఉన్న తేడాలను చెప్పడానికి కూడా కాదు. ఎన్నికల సందర్భంగా ఆవిష్కృతమయిన రాజకీయవాతావరణాన్ని అర్థం చేసుకోవడానికి ఆ ప్రశ్నలు పనికిరావచ్చు. పెరిగిపోతున్న కర్కశతకు, నిర్దాక్షిణ్యతకు సమాధానంగా రూపుదిద్దుకోగలిగే ప్రతికథనాలను గుర్తించడానికి కూడా సహాయపడవచ్చు. కేసీఆర్ కనుక, మొన్నటి ఎన్నికల్లో అధికారం పోగొట్టుకోకపోయి ఉంటే, ఓడిపోయినాక మరీ ప్రస్తుత దయనీయ స్థితికి ఆయన పార్టీ చేరుకోకపోయి ఉంటే, బహుశా కవిత అరెస్టు జరిగేది కాదేమో? రేపటి కేంద్రప్రభుత్వానికి ఏ విధంగానూ ఆయన ఉపయోగపడగలిగే పరిస్థితి లేదు. ఆ నిరుపయోగత్వం నుంచే కవిత అరెస్టు సులువుగా జరిగిపోయింది. మద్యం కేసులో ఆమె కథానాయిక కాదు. సంధానకర్త వంటి పాత్రలో మాత్రమే ఆమె ఉన్నారట. కేసుకు ఆ పాత్రే కీలకం మరి. కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడానికి పూర్వరంగంగా ఆమె అరెస్టు జరిగింది. ఆమెను ప్రధానముద్దాయిల్లో చేర్చి కూడా, అరెస్టు చేయకుండా ఉండే సామర్థ్యం, చాతుర్యం దర్యాప్తు సంస్థలకు ఉన్నాయి కానీ, అంతటి ఔదార్యం ప్రకటించవలసిన అవసరం ఇప్పుడులేదు. కవిత మీద కానీ, బీఆర్ఎస్ మీద కానీ కేంద్రప్రభుత్వం, బీజేపీ, మోదీషా కత్తిగట్టారనుకోవడానికి తగిన రాజకీయ వాదన చెలామణిలో లేదు. తెలంగాణ అధికార కుటుంబ సభ్యురాలై ఉండి కూడా, రాష్ట్ర రాజకీయాలలో అప్రధానమైనపాత్రలోనే మిగిలిపోయిన వ్యక్తి, ఇట్లా రాష్ట్రం దాటి దేశరాజధానిలో ఏదో ధనార్జన మార్గంలో, అది కూడా ఏమంత గౌరవప్రదం కాని మద్యం వ్యాపారంలో, ప్రమేయం పెట్టుకోవడం ప్రజలు హర్షించలేదు. కుంగి కునారిల్లినదశలో, బీఆర్ఎస్‌కు మోదీ మీద కత్తులు నూరగలిగే విలాసత్వమూ లేదు. కేజ్రీవాల్ విషయం అట్లా కాదు. దేశమంతా గెలిచినా ఢిల్లీలో తాము గెలవలేకపోతున్నామని, ఉన్నచోట ఉండకుండా అతను ఇతర రాష్ట్రాలకు విస్తరిస్తున్నాడని, అన్నిటి కంటె మించి, 'ఇండియా కూటమి'లో భాగమయ్యాడని బీజేపీకి ఆయనంటే కోపం ఉంది. కేజ్రీవాల్ అరెస్టులో నైతిక నిష్ఠ కంటె, పగాప్రతీకారాలూ ఎక్కువని అంటే, బీజేపీ వీరాభిమానులు కూడా పెద్దగా ఖండించబోరు. 370, 400 స్థానాల లక్ష్యాలను అందుకోవడానికి కేజ్రీవాల్ ఒక అవరోధం కూడా కావచ్చు. ఇన్ని రాజకీయ కారణాలున్నంత మాత్రాన, కేజ్రీవాల్ మద్యం కుంభకోణంలో లేరని కాదు. కాకపోతే, తన మీద అభియోగం తప్పని, ఇదంతా కక్షసాధింపు అని ఆయన చెప్పుకుంటే జనం వింటారు, హేళన చేయరు. అరవింద్ కేజ్రీవాల్ అవినీతి సొమ్ము తీసుకుని, గోవా ఎన్నికల్లో ఖర్చుపెట్టారని ఈడీయే చెబుతోంది, కవిత విషయంలో ఆ రాజకీయ కారణం కూడా లేదు! సమాజంలోని అన్ని రంగాలకు, ఏదో ఒక నైతికమయిన చెలియలికట్ట ఉంటుంది. కొందరు వ్యక్తుల్లో, కొన్నిచిహ్నాల్లో ఆ హద్దులకు ప్రమాణంగా ఉంటారు. రాజకీయరంగంలో ఒకప్పుడు జయప్రకాశ్ నారాయణ్, తరువాత విపిసింగ్, కొందరికి వాజపేయి, అబ్దుల్ కలాం, అట్లాగే, అన్నా హజారే.. ఆయా కాలాల్లో కొంత నైతిక ప్రభ వెలిగించారు. కారుచీకటి అనుకున్న కాలంలో కూడా జనం ఏదో ఒక ఔన్నత్యాన్ని గుర్తించి లేదా భావించి, దాన్ని ఆశగా నిలుపుకుంటారు. అన్నాహజారే పదిపన్నెండేళ్ల కిందట, ఈ కేజ్రీవాల్ తో కలిసి ఢిల్లీలో చేసిన హడావుడి, రెండో యూపిఎ ప్రభుత్వాన్ని అప్రదిష్ట పాలు చేసింది. భ్రష్టుపట్టిపోవడానికి తగినంత అవినీతి, దుష్పరిపాలన ఆ ప్రభుత్వం చేయలేదని కాదు. నరేంద్రమోదీ వెలిగిపోవడానికి ముందు, యుపిఎ ప్రభుత్వం కేవలం చీకటియుగం మాత్రమేనని నమ్మకంగా చెప్పి, జనాల మనస్సులను సిద్ధం చేసిన కూటమి ఆ నీతిపరులదే! తాము చేసిన అవినీతి వ్యతిరేక ఆందోళన ఇంతటి నిరంకుశ పాలనను తీసుకువస్తుందని ఊహించలేదని ఒక్క యోగేంద్ర యాదవ్ మాత్రమే పశ్చాత్తాపపడ్డట్టున్నారు! తాము ఎటువంటి పర్యవసానాలకు కారణమయ్యారో, సిసోడియా, కేజ్రీవాల్ అనుభవపూర్వకంగా తెలుసుకుంటున్నారు! ఇప్పుడు, నైతికమయిన బెంచ్ మార్క్ లేవీ సమాజంలో లేవని, అక్కరలేదని కూడా బీజేపీ భావిస్తున్నది. నీతికబుర్లు చెప్పేవారందరూ అవినీతిపరులని నిరూపణ అయిందని, బలంగా ఉండి, దేశాన్ని దృఢత్వం వైపు తీసుకువెళ్లగలిగే తన వంటి రాజకీయ శక్తి ఉనికిలో ఉండగా మరొక ఎంపిక అవసరమే లేదని ప్రజలకు చెబుతోంది. ప్రాంతీయపార్టీలు, చిన్నపార్టీలు అన్నీ%-%అయితే కుటుంబ పార్టీలో లేదా అవినీతి పార్టీలో%-%అయి ఉంటాయని ప్రధాని తన సభల్లో పదే పదే చెబుతూ వస్తున్నారు. తను మాత్రమే ప్రజలే కుటుంబంగా జీవిస్తున్నానని చెప్పుకుంటున్నారు. ప్రజల దృష్టిలో ఈ నాయకులను పలచన చేసినంత మాత్రాన సరిపోదు కాబట్టి, ఆ పార్టీల బలాన్ని, బలగాన్ని ఛిన్నాభిన్నం చేయడానికి ఒకవైపు దర్యాప్తు యంత్రాంగాలను, మరొకవైపు రాజకీయచాణక్యాన్ని ప్రయోగిస్తున్నారు. బహుజన సమాజ్ పార్టీ నాయకురాలు మాయావతి కూడా కేసుల పద్మవ్యూహంలో చిక్కుకోవడం వల్ల మాత్రమే తన పార్టీని నిష్క్రియాత్మకం చేసుకోవలసివచ్చిందని చెబుతారు. అఖిలేశ్ యాదవ్ తల మీద కూడా అనేక కత్తులు వేలాడుతున్నాయి. మమతా బెనర్జీ 'ఇండియా కూటమి'కి ఎడంగా మెలగడానికి తగిన కేంద్రకారణమే ఉన్నదని ఊహిస్తున్నారు. నాడు కేసీఆర్ కూడా మాటల్లో మంటలు కురిపించినా, లోలోపల భయభక్తులతో ఉండడానికి కారణాలున్నాయంటారు. జగన్ సంగతి తెలిసిందే. అట్లాగని, ఈ దండోపాయానికి అందరూ, అన్ని వేళలా లొంగిపోతారని అనడానికి లేదు. కొందరు నిలబడతారు, మరికొందరు ఓపిక నశించాక తిరగబడతారు. జైలులో సుదీర్ఘకాలం గడిపినా, ఇంకా కేసులు ముగియకపోయినా, లాలూ ప్రసాద్ బేలగా మారలేదు, జనాకర్షణా కోల్పోలేదు. ఇప్పుడు అరవింద్ కేజ్రీవాల్ కూడా తన మీద జరుగుతున్న రాజకీయదాడికి కుంగిపోయేటట్టు కనిపించడం లేదు. అవినీతి వ్యతిరేక ఉద్యమం చేసి తమ ఓటమికి కారణమయిన కేజ్రీవాల్‌తో కాంగ్రెస్ తన సంబంధాలు మెరుగుపరుచుకోవడం విశేషం. 'ఆప్' విస్తరణ ప్రయత్నాలమీద బీజేపీతో సమానంగా కాంగ్రెస్ కూడా ఒకప్పుడు అసహనం చూపింది. కొంతకాలం కిందట రెండుపార్టీల మధ్య పొత్తు అసాధ్యమనిపించింది. కానీ, సర్దుబాటు చేసుకోవడంతో పాటు, ఆశ్యర్యకరంగా ఇప్పుడు ఒకరికొకరు నిలబడుతున్నారు కూడా. ప్రతిపక్ష 'ఇండియా' కూటమికి గట్టి రాజకీయ నినాదం లేదని అంతా అంటున్నారు కానీ, భారతీయ జనతా పార్టీకి కూడా ఈ సారి నినాదాల కొరత ఉన్నది. పరివార్ వాద్, భ్రష్టాచార్ అన్నీ అయిపోయాయి. అబ్ కీ బార్ మోదీసర్కార్, ఫిర్ ఏక్ బార్ మోదీ సర్కార్ పోయినసారే అయిపోయాయి.

# నట్టడివిలో నిలువుదోపిడీ...!



దుబ్బాక: నట్టడివిలో వెలిసిన మల్లన్న ఆలయంలో భక్తులు నిలువుదోపిడీకి గురవుతున్నారు. మొక్కులు తీర్చకుంటే ఏ కీడు శంకిస్తుందోననే సందేహం.. దేవుడి వద్దకు వచ్చి పూజారులతో గొడవ పడొద్దనే సంయమనం భక్తుల పాలిట శాపంగా మారింది. దేవాదాయశాఖ పరిధిలోని దుబ్బాక రేకులకుంట మల్లికార్జున, రేణుకాదేవి ఎల్లమ్మ ఆలయంలో కొందరు ఒగ్గుపూజారుల ఆగడాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని భక్తులు వాపోతున్నారు. దుబ్బాక అటవీ ప్రాంతంలోని రేకులకుంట మల్లికార్జున ఆలయానికి రాజన్నసిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో నుంచే కాకుండా షోలాపూర్, బీవండి, నాందేడ్, బీదర్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. ఏడాది పొడువునా ప్రతీ ఆదివారం, మంగళవారం ఆలయానికి భక్తుల రద్దీ ఉంటుంది. భక్తులు పట్నాలు, మత్తకొలపడం, బోనాలు తీయడం, సుంకు బియ్యం సమర్పించడం వంటి మొక్కులు తీర్చుకుంటారు. దీనికి దేవాదాయశాఖ రూ.250 టికెట్ ధరను నిర్ణయించింది. అయితే ఆలయంలో అర్చకత్వం కింద 63 మంది పూజారులను నియమించారు. ఇక్కడి ఆచారం ప్రకారం పట్నాలను ఈ ఒగ్గుపూజారులు వేయడం ఆనవాయితీ. ఇందుకు దేవాదాయ శాఖ వారికి గౌరవ వేతనం అందిస్తుంది. తొలిరోజుల్లో భక్తులు ఒగ్గుపూజారులకు డబ్బు ఇస్తే అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తూ వచ్చారు. అదే ప్రమాదంగా మారి, భక్తులకు శాపమైంది. చాలా దూరం నుంచి భక్తులు ఇక్కడికి బంధు, మిత్రగణంతో వచ్చి, బసచేసి, రాత్రే పూజా కార్యక్రమాలను నిర్వహించడం పరిపాటిగా వస్తోంది. వారి వెంట తెచ్చుకున్న మేకను మత్తగొలిపి, కుటుంబసభ్యులు, బంధువులతో విందు భోజనాలను చేస్తారు. అందుకే, తెల్లారితే బంధువులు, మిత్రులు వస్తారని, భక్తులు పూజాది కార్యక్రమాలను రాత్రి వేళ సకాలంలో పూర్తి చేసుకోవాలని చూస్తారు. ఇదే అదునుగా కొందరు పూజారులు తమ ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు. అడిగినంత డబ్బు ఇవ్వకుంటే పూజలను చేసేందుకు నిరాకరిస్తున్నారు. భక్తులతో కటువుగా వ్యవహరిస్తూ డబ్బివ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అడిగినంత ఇవ్వని భక్తులను మొక్కులు చెల్లించకుండా ఆలయం నుంచి వెళ్లగొట్టేంత పని చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆలయం పలుసార్లు వివాదాస్పదంగా మారడం, అక్రమాలకు తావివ్వకుండా ఉంటుందని భావించిన దివంగత ఎమ్మెల్యే రామలింగారెడ్డి సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. అయితే, ఆయన మరణానంతరం సీసీ కెమెరాలను తొలగించారు.

# రైతులను ముంచిన వాన...!



**జనగామ :** జిల్లాలో అకాల వర్షం అన్నదాతను ఆగమాగం చేసింది. శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పలు ప్రాంతాల్లో స్వల్ప నుంచి మోస్తరు వానలు కురిశాయి. బలమైన ఈదురుగాలులకు తోడు ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. పలు చోట్ల పిడుగులు పడ్డాయి. ఈదురుగాలులతో కూడిన వర్షం కారణంగా జిల్లాలో ఆయా ప్రాంతాల్లో చేలల్లో వరి పంటలు నేలకొరిగాయి. నేడో, రేపో కోతకు వచ్చిన పంట ఈదురుగాలులతో నేలకొరగడంతో అన్నదాతకు తీవ్ర నష్టం వాటిల్లింది. సుమారు గంటకు పైగా కురిసిన వానతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. పిడుగుపాటు కారణంగా విద్యుత్ స్తంభాలపై ఇన్సులేటర్లు ధ్వంసం కావడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. అకాల వర్షం కారణంగా జిల్లాలో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయింది. చాలా వరకు కొనుగోలు కేంద్రాలను లోతట్టు ప్రాంతాల్లో ఏర్పాటు చేయడంతో వర్షపు నీరు నిలిచింది. గత ఏడాది చాలా సెంటర్లలో వర్షపు నీరు నిలవడం వల్ల వడ్ల కుప్పలు మునిగిపోయాయి. కొన్నిచోట్ల కొట్టుకుపోయాయి. ఈ సారి కూడా లోతట్టు ప్రాంతాల్లో సెంటర్లను తెరవడంతో చిన్నపాటి వర్షానికే నీరు నిలిచింది. వడ్లకుప్పల కింది నుంచి నీరు ప్రవహించి ధాన్యం తడిసిపోయింది. ఇవ్వాలో, రేపో కాంటా అవుతుందనుకుంటున్న సమయంలో వర్షం పడి తడవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

# మోడీ విద్వేష ప్రసంగాలపై స్పందించరేం?



**న్యూఢిల్లీ :** విద్వేష ప్రసంగాలు చేస్తూ మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్న ప్రధాని నరేంద్ర మోడీపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్‌కు లేఖ రాశారు. హిందూ, ఇండియన్ ఎక్స్‌ప్రెస్, టైమ్స్ ఆఫ్ ఇండియా ఢిల్లీ ఎడిషన్లలోని మొదటి పేజీల్లో మోడీ ప్రసంగాలకు సంబంధించి వచ్చిన క్లిప్పింగ్‌లను కూడా ఆ లేఖతో పాటూ జతపరిచి పంపారు. బిజెపి చీఫ్‌గా నరేంద్ర మోడీ ప్రస్తుత లోక్‌సభ ఎన్నికలకు ప్రచారం చేస్తూ, రెచ్చగొట్టేలా అత్యంత విద్వేషపూరితమైన వ్యాఖ్యలు, ప్రసంగాలు చేసిన వార్తలు ఆ క్లిప్పింగ్‌ల్లో వున్నాయి. రాజస్థాన్‌లోని బన్స్‌వాడాలో ఆదివారం బహిరంగ సభలో ప్రధాని ప్రసంగిస్తూ, "మీరు ఎంతగానో కష్టపడి సంపాదించిన సొమ్మును మరింతమంది పిల్లలున్నవారికి, చొరబాటుదారులకు ఇచ్చేస్తారా?" అని పరోక్షంగా ముస్లింలను సూచిస్తూ ప్రశ్నించారు. ఈ మూడు వార్తాపత్రికల్లోనే కాకుండా మోడీ చేసిన ఈ ప్రసంగ వార్తలు ప్రధాన స్రవంతిలోని మీడియా, సోషల్ మీడియాలోనూ వచ్చాయి. నిర్దిష్టంగా ఏ కమ్యూనిటీనైనా లక్ష్యంగా చేసుకోవడం ఎన్నికల ప్రవర్తనా నియమావళిని, ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 123(3)ని పూర్తిగా ఉల్లంఘించడమేనని ఎన్నికల కమిషన్ అంగీకరిస్తుంది. ఇవి కాకుండా, ప్రజా కార్యాచరణ, బూటకపు వార్తలు, మతాన్ని ప్రేరేపించడం, విద్వేష పూరితమైన ప్రసంగాలు చేయడం వంటి అంశాలపై రాజకీయ పార్టీలను హెచ్చరిస్తూ ఎన్నికల కమిషన్ ప్రతీసారీ సూచనలు జారీ చేస్తూనే వచ్చింది. తాజాగా మార్చి 1వ తేదీన కూడా ఇందుకు సంబంధించి సర్క్యులర్ జారీ చేసింది. ఎన్నికల కమిషన్ ఆదేశాలను దారుణంగా ఉల్లంఘిస్తూ గతంలో జరిగిన సంఘటనల గురించి సిపిఎం ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువచ్చిందని ఏచూరి ఆ లేఖలో గుర్తు చేశారు. ఇందుకు సంబంధించి ఫిర్యాదు చేస్తూ ఈ నెల 13న లేఖ రాశామని తెలిపారు. మతాన్ని ప్రేరేపిస్తూ, అయోధ్యలో రామాలయంలో ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని ప్రస్తావిస్తూ ప్రతిపక్ష పార్టీలపై, నేతలపై తీవ్రమైన ఆరోపణలు చేశారని, వారిని రాముడికి వ్యతిరేకులుగా ముద్ర వేశారని పేర్కొంటూ అందుకు సంబంధించి మోడీ వివిధ సందర్భాల్లో చేసిన ప్రసంగాలను ఏచూరి ఆ లేఖలో ఉదహరించారు. ఈ ఫిర్యాదుపై ఎన్నికల కమిషన్ స్పందన ఏమిటో ఇంతవరకు తమకు ఎలాంటి సమాచారం లేకపోవడం విచారకరమని ఏచూరి ఆ లేఖలో పేర్కొన్నారు. ఒక కమ్యూనిటీని ఉద్దేశించి విద్వేష ప్రసంగానికి పాల్పడడం చాలా దారుణమైనదని అన్నారు. ఇటువంటి విద్వేష ప్రసంగాలు చేసిన నేతలపై నిషేధాలు విధించిన ఘటనలు గతంలో వున్నాయని ఏచూరి గుర్తు చేశారు.

## బాలిక గర్భవిచ్ఛిత్తికి సుప్రీం అనుమతి...!



**న్యూఢిల్లీ :** అత్యాచారానికి గురైన 14 ఏళ్ల బాలిక 30 వారాల గర్భవిచ్ఛిత్తికి సోమవారం సుప్రీంకోర్టు అనుమతించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద తనకు లభించిన అసాధారణ అధికారాలను ఉపయోగించి బాధిత బాలికకు పూర్తి న్యాయం చేయడానికి సుప్రీంకోర్టు ఈ గర్భ విచ్ఛిత్తికి అనుమతించింది. బాలిక మానసిక, శారీరక శ్రేయస్సును రక్షించడానికి అసాధారణ నిర్ణయం తీసుకుంది. మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగెన్సీ (ఎంటిపి) కింద సాధారణంగా 24 వారాల ఉన్న గర్భవిచ్ఛిత్తికే అనుమతి ఉంటుంది. ప్రెగెన్సీని పొడిగించడం మైనర్ శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్న మెడికల్ బోర్డ్ సిఫారసులకు ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్, జస్టిస్ జె.బి. పార్థివాలాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం అంగీకరించింది. గర్భం దాల్చిన విషయాన్ని అత్యాచార బాధిత బాలిక ఆలస్యంగా గుర్తించింది. చట్టం ప్రకారం అనుమతి ఉన్న 24 వారాల తరువాత అంటే మార్చి 20న ఈ కేసులో ఎఫ్ఐఆర్ నమోదైంది. గర్భవిచ్ఛిత్తికి బాంబే హైకోర్టు ఈ నెల 4న తిరస్కరించడంతో బాలిక తల్లి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. బాలికకు ప్రతీ గంట కీలకమని సిజెఐ చంద్రచూడ్ వ్యాఖ్యానించారు. ఈ కేసులో తరువాత పూర్తి వివరాలతో ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు. కోర్టు విధివిధానాలను సాకుగా చూపుతూ వైద్య ప్రక్రియను ఆలస్యం చేయవద్దని అధికారులను ఆదేశించింది. బాలిక వైద్య, రవాణా ఖర్చులను భరించడానికి మహారాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చింది.

## మాల్దీవులు పార్లమెంట్ ఎన్నికల్లో ముయిజ్జు పార్టీ ఘన విజయం



**మాలే :** మాల్దీవులు పార్లమెంట్ ఎన్నికల్లో అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జుకు చెందిన పీపుల్స్ నేషనల్ కాంగ్రెస్ (పిఎన్‌సి) భారీ మెజార్టీతో విజయం సాధించింది. మొత్తం 93 స్థానాలకు గాను 70 సీట్లను కైవసం చేసుకుంది. మాల్దీవులు పార్లమెంటు (పీపుల్స్ మజ్లీస్)లోని 93 నియోజకవర్గాలకు ఆదివారం పోలింగ్ నిర్వహించారు. మొత్తం 602 బ్యాలెట్ బాక్సులు ఏర్పాటుచేశారు. వీటితోపాటు మూడు ఇతర దేశాల్లో (భారత్‌లోని తిరువనంతపురం, శ్రీలంకలోని కొలంబో, మలేషియాలోని కౌలాలంపూర్) వీటిని ఉంచారు. మొత్తం 2.84 లక్షల మంది ఓటర్లు ఉండగా.. 75 శాతం పోలింగ్ నమోదైంది. ఫలితాల్లో ముయిజ్జుకు చెందిన పిఎన్‌సి 70 స్థానాలను గెలుచుకోగా.. దాని మిత్రపక్షాలు మూడుచోట్ల విజయం సాధించాయి. మాజీ అధ్యక్షుడు ఇబ్రహీం మహమ్మద్ సోలికి చెందిన మాల్దీవియన్ డెమొక్రటిక్ పార్టీ (ఎండిపి) 15 సీట్లకే పరిమితమైంది.

## తైవాన్‌ను వణికిస్తున్న వరుస భూకంపాలు 80 సార్లు కంపించిన భూమి



తైపీ : తూర్పు ఆసియా దేశంలోని తైవాన్‌ను వరుస భూకంపాలు వణికించేస్తున్నాయి. నిన్న (సోమవారం) అర్ధరాత్రి గంటల వ్యవధిలోనే 80 సార్లు భూమి కంపించడంతో అక్కడి ప్రజలు భయాందోళనతో బయటకు పరుగులు తీశారు. రాత్రంతా రోడ్లపైనే గడిపారు. ప్రస్తుతం అక్కడ ప్రకంపనలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. భూకంపాల ధాటికి కొన్ని భవనాలు నేలమట్టం కాగా, ప్రాణ నష్టంపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఏప్రిల్ తొలివారంలో ఈ ద్వీప దేశం భారీ భూకంపంతో గజగజలాడిపోయిన సంగతి విదితమే. తైవాన్ తూర్పు ప్రాంతంలో నిన్న రాత్రి నుంచి మంగళవారం వేకువజాము వరకు భూమి కంపించింది. భారీ ప్రకంపనల ధాటికి రాజధాని తైపీలో భవనాలు ఊగిపోయాయి. భూకంప కేంద్రం హువాలిన్‌లో నమోదు అయ్యిందని, ఇప్పటి వరకు పదుల సంఖ్యలో ప్రకంపనలు నమోదు అయ్యాయని, వాటిల్లో రిక్టర్ స్కేల్ పై 6.3 తీవ్రత అధికంగా నమోదు అయ్యిందని అక్కడి అధికారులు చెబుతున్నారు. అయితే.. ఏప్రిల్ 3వ తేదీన ఈ ప్రాంతంలోనే భూకంప కేంద్రం నమోదు కాగా.. రిక్టర్ స్కేల్ పై 7.2 తీవ్రతతో సంభవించిన భూకంపం ధాటికి పలు భవనాలు నేలమట్టం అయ్యాయి. ఏప్రిల్ 3 నాటి భూకంపం ధాటికి ఏకంగా ఫ్లైఓవర్, వంతెనలే ఊగిపోయాయంటే తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. అయితే 14 మంది మరణించారు. అప్పటి నుంచి తరచూ ఆ దేశంలో భూమి కంపిస్తూనే వస్తోంది. రెండు టెక్టోనిక్ ప్లేట్ల జంక్షన్ సమీపంలో ఉండడంతో తైవాన్ భూకంపాలు తరచూ సంభవిస్తుంటాయి. 1993లో రిక్టర్ స్కేల్ పై 7.3 తీవ్రతతో సంభవించిన భూకంపం కారణంగా.. 2000 మంది మరణించారు. ఆ తర్వాత 2016 లో ఆ దేశం దక్షిణ ప్రాంతంలో సంభవించిన భూకంపం ధాటికి 100 మంది మరణించారు. ఏప్రిల్ 3వ తేదీన సంభవించిన భూకంపం తైవాన్‌లో పాతికేళ్ల తర్వాత సంభవించిన భారీ భూకంపంగా నమోదు అయ్యింది.

## ముమ్మాటికీ కోడ్ ఉల్లంఘనే...!





**న్యూఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోడీ ఆదివారం రాజస్థాన్‌లోని బాన్స్‌వారాలో చేసిన ప్రసంగం 30 ఏళ్లలో అత్యంత విద్వేషపూరితమైనదని, ఇందుకుగాను ఆయనపై చర్య తీసుకోవాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్న తరుణంలో మోడీ అవే వ్యాఖ్యలను సోమవారం ఉత్తరప్రదేశ్‌లోని అలీగఢ్ సభలో రిపీట్ చేశారు. ప్రధాన మంత్రి వంటి అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తి ఇలా ఒక మతాన్ని టార్గెట్‌గా చేసుకుని ఈ విధంగా విద్వేషాలను రెచ్చగొట్టడం ముమ్మాటికీ ఎన్నికల కోడ్ ఉల్లంఘనే. ముస్లింలపై విషం గక్కిన మోడీ ప్రసంగంపై కేసు నమోదు చేసేందుకు ఢిల్లీ పోలీసులు నిరాకరించడం, ఇటువంటి ప్రసంగాలపై కొరడా ఝుళిపించాల్సిన కేంద్ర ఎన్నికల సంఘం బెల్లం కొట్టిన రాయిలా మిన్నకుండడం వల్లే ఆయన అంతకంతకూ రెచ్చిపోతున్నారు. రాజకీయ లబ్ధి కోసం సమాజంలో విద్వేషాలను రెచ్చగొడుతున్న మోడీ పై ఎన్నికల సంఘం వెంటనే చర్య తీసుకోవాలని రాజకీయ పార్టీలు, పౌర సంస్థలు, ఎన్నికలవాచ్‌డాగ్ ఎడిఆర్ వంటివి డిమాండ్ చేశాయి. చివరికి దీర్ఘకాలం బిజెపితో చెలిమి చేసి రైతు ఉద్యమం సందర్భంగా తెగతెంపులు చేసుకుని బయటకొచ్చిన శిరోమణి అకాలీదళ్ కూడా మోడీ వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్త చేసింది.

## ఉద్రిక్తతల నిలయంగా పశ్చిమాసియా...!

20 డమాస్కస్‌లో తమ రాయబార కార్యాలయంపై జరిగిన దాడికి ప్రతీకారంగా ఇరాన్ ఇజ్రాయిల్‌పై డజన్ల కొద్ది క్షిపణులు, డ్రోన్లు కురిపించింది. ఇక ఇజ్రాయిల్ ఏప్రిల్ మొదటి తేదీన ఇరాన్ రాయబార కార్యాలయంపై దాడి చేసి పదమూడు మంది ప్రాణాలు తీసింది. అత్యున్నత హోదాగల ఇద్దరు ఇరాన్ విప్లవ సైనిక గార్డులు కూడా మరణించిన వారిలో వున్నారు. ఈ దాడి 1961 నాటి వియన్నా ఒప్పందాన్ని ఉల్లంఘించడమే. దేశాల దౌత్య సంబంధాలను నిర్దేశించే ఈ ఒప్పందంతో పాటు రాయబార కార్యాలయాల సంబంధాలపై 1963 వియన్నా ఒప్పందాన్ని కూడా ఈ చర్య అతిక్రమించింది. దౌత్యకార్యాలయాల ప్రాంగణాలపై ఎలాంటి దాడి జరపరాదని ఈ నిబంధనలు స్పష్టంగా నిషేధిస్తున్నాయి. కనుక ఇజ్రాయిల్ చర్యతో పశ్చిమాసియాలోని అత్యంత ఉద్రిక్త పరిస్థితికి అగ్గి ముట్టించినట్టయింది. అక్కడ సంఘర్షణలకు ఆజ్యం పోసింది. పశ్చిమాసియాలో దుండగీడు రాజ్యంగా వ్యవహరిస్తోంది ఇజ్రాయిల్. పాలస్తీనాపై దాని జాతి హత్యాకాండ మొదలై ఇప్పటికి ఆరు మాసాలు దాటుతోంది. 34,000 మందికి పైగా పాలస్తీనియన్లు హతులైనారు. వారిలో అత్యధికులు స్త్రీలూ, పిల్లలే, ఇజ్రాయిల్ దాడులు కేవలం గాజా ప్రాంతానికే పరిమితమై లేవు. పశ్చిమ తీరంలోనూ వందలమంది పాలస్తీనియన్లకు గురిపెట్టి మరీ ప్రాణాలుబలిగొన్నది. సిరియా లెబనాన్ ఇరాక్‌లకూ ఈ దాడిని విస్తరించింది. ఇజ్రాయిల్ ఇంత విచ్చలవిడిగా నిస్సంకోచంగా వ్యవహరిస్తున్నదంటే అమెరికా, నాటో కూటమి సర్వవిధాల బీరుపోకుండా వత్తాసునివ్వడమే కారణం. స్టాకహోంలోని శాంతి పరిశోధనా సంస్థ (ఎస్ఐపిఆర్ఐ) అంచనాల ప్రకారం 2019-2023 మధ్య ఇజ్రాయిల్ ఆయుధాలలో 69 శాతం అమెరికా నుంచే దిగుమతి చేసుకుంది. నిజానికి డమాస్కస్‌లో ఇరాన్ దౌత్య కార్యాలయంపై దాడి చేసేందుకు అమెరికా ఆయుధాలనే ఇజ్రాయిల్ ఉపయోగించుకుంది. నిజానికిది అమెరికా ఆయుధ ఎగుమతి నియంత్రణ చట్టం నిబంధనలకు వ్యతిరేకం. ఈ ఆయుధాలను కేవలం న్యాయమైన ఆత్మరక్షణకే ఉపయోగించాలని ఆ నిబంధనలు చెబుతున్నా అమెరికా పట్టించుకోలేదు. ఆపైన ఇజ్రాయిల్ దాడిని ఖండిస్తూ ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో రష్యా ప్రతిపాదించిన ప్రకటనను బలపర్చేందుకు కూడా అమెరికా బ్రిటన్ ఫ్రాన్స్ నిరాకరించాయి. ఆఖరుకు భారత ప్రభుత్వం కూడా ఈ దాడిపై కేవలం ఆందోళన వ్యక్తం చేసిందే తప్ప ఖండించేందుకు సిద్ధం కాలేకపోయింది. ఈ విధమైన నిష్క్రియా ప్రియత్వమే ఇజ్రాయిల్‌కు కొమ్ములు తెచ్చింది. అది ఇరాన్‌ను దాడికి లక్ష్యంగా చేసుకోవడం ఇదేమీ మొదటిసారి కాదు. ఇరాన్‌పై అనేకసార్లు డ్రోన్లతో దాడికి దిగింది. ఆ దేశ భూభగంలో హత్యలకూ సైబర్ దాడులకూ పాల్పడింది. 2024 జనవరిలో ఇరాన్ లోని ఒక నగరంలో లోతుగా బాంబులు పాతి వంద మందికి పైగా ప్రజలు మరణించడానికి కారణమైంది. అగ్రశ్రేణి శాస్త్రజులు, ఇంజనీర్లు హత్యగావించబడ్డారు. ఇరాన్ అణుబాంబు తయారు చేయకుండా అడ్డుకోవాలనే సాకుతో సాగిన ఈ కవ్వింపు చర్యలన్నిటికీ అమెరికా ఆశీస్సులతో జరిగినవే. తమ సంస్థకు సంబంధించినంత వరకూ ఇరాన్ అణుబాంబు కలిగి వున్నట్టు చెప్పే సమాచారం గానీ, సంకేతాలు గానీ ఏవీ లేవని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఎఇఎ) డైరెక్టర్ జనరల్ రాఫెల్ గ్రాసీ చాలా తాజాగా ఏప్రిల్ 14నే ప్రకటించారు. అయితే ఈ అంచనా అమెరికాకు గానీ, ఇరాన్‌కు గానీ పట్టదు. ఏదో విధంగా ఇరాన్‌ను కల్లోల పర్చవడమే వాటి లక్ష్యం. ఎందుకంటే పశ్చిమాసియాలో వాటి ఆధిపత్యానికి ప్రధాన సవాలుదారుగా వున్న దేశం అదే. బెంజిమన్ నెతన్యాహూ ఉద్దేశపూర్వకంగానే యుద్ధాన్ని ఎగదోస్తున్నాడు. హమాస్‌ను అణచివేయడంలో ఆయన విఫలం కావడం తప్ప ఇందుకు వేరే కారణం లేదు. దాన్ని నిర్మూలించడమే లక్ష్యమంటూ ఆయన పాలస్తీనియన్లపై మారణకాండ ప్రారంభించాడు. కానీ ఇప్పటి వరకూ బందీలను విడిపించడంలోనూ ఆయన కృతకృత్యం కాలేకపోయారు. అవినీతికీ, అసమర్థతకూ మారుపేరుగా తయారైన నెతన్యాహూ పాలనపై విసుగెత్తివున్న ఇజ్రాయిలీల ఆగ్రహం మరింత పెరగడానికి ఇవన్నీ దారితీశాయి. ఆయన రాజీనామా చేయాలంటూ వేలు లక్షల మంది ఇజ్రాయిలీలు నిరంతరాయంగా నిరసనలు తెల్పుతూనే వున్నారు. ఒకసారి ఈ యుద్ధం ముగిస్తే ఇక తాను అధికారంలో కొనసాగడం తథ్యమని నెతన్యాహూకు బాగా తెలుసు. అమెరికా పశ్చిమాసియాలో మోసపూరిత పాత్ర పోషిస్తున్నది, మంటలు చల్లార్చడానికి వచ్చినట్టు నటిస్తూ వాస్తవంలో అగ్నికి ఆజ్యం పోసే పాత్ర నిర్వహిస్తున్నది. అమెరికా మిత్రదేశాలైన బ్రిటన్, వంటివి యుద్ధ విరమణకోసం జోక్యం చేసుకోవాలంటే ఆయా తమ దేశస్తుల నుంచి తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్నాయి. అవి ఇజ్రాయిల్‌కు ఆర్థిక మద్దతు, ఆయుధ సరఫరాలు నిలిపివేయడం ద్వారా ఈ పనిచేయొచ్చు.కానీ ఇజ్రాయిల్ వాటికి నమ్మకమైన మిత్ర దేశం. పశ్చిమాసియాలో వాటి పట్టు నిలబెట్టుకోవడానికి అదే సాధనంగా వుంది. మరో వైపునుంచి చూస్తే అతి త్వరలోనే ఎన్నికలు ఎదుర్కోవాల్సిన ఈ దేశాలలో ప్రజల నుంచి వచ్చే నిరసనలను విస్మరించలేవు కూడా. అందుకే ఇజ్రాయిల్ అదుపు అంటూ ఏదో అభినయిస్తున్నాయి. ఇరాన్ క్షిపణి దాడులపై అమెరికా, యూరోపియన్ యూనియన్ నాటో వంటి వాటి ప్రతిస్పందన మరోసారి వాటి కపటత్వాన్ని బహిర్గతం చేసింది. ఇరాన్ క్షిపణులు లక్ష్యాలను ఛేదించకుండా విఫలం చేయడంలో అమెరికా బ్రిటన్ జోర్డాన్ ప్రధాన పాత్ర వహించాయి. తమ చెక్కుచెదరని నేస్తమైన ఇజ్రాయిల్‌కు మద్దతు నిస్తున్నట్టు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ప్రకటించారు. పైకి మాత్రం ఆ ప్రాంతాన్ని మరింత విస్తృతమైన యుద్ధంలోకి దించే మరే విధమైన తదుపరి చర్యలకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేశాడు. అయితే ఇజ్రాయిల్‌ను కేవలం ప్రకటనలతో బెదిరింపులతో లంగదీయడం కుదిరేపని కాదు.

# ఆ మసాలా ఉత్పత్తుల్లో క్యాన్సర్ కారకాలు.....





ఎవరెస్ట్, ఎండీహెచ్ కంపెనీలకు చెందిన పలు మసాలా ఉత్పత్తులపై సింగపూర్, హాంకాంగ్ నిషేధం విధించిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అలర్ట్ అయింది. ఆయా మసాలా ఉత్పత్తుల్లో క్యాన్సర్ కారక ఇథిలీన్ ఆక్సైడ్ ఉందని సింగపూర్, హాంకాంగ్ గుర్తించిన నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యలను చేపట్టే దిశగా సర్కారు నడుం బిగించింది. మనదేశంలోని అన్ని మసాలా ఉత్పత్తులకు సంబంధించిన శాంపిళ్లను సేకరించాలని భారత సర్కారు సంబంధిత విభాగాలకు ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు దేశంలోని ఫుడ్ కమిషనర్లు అందరినీ అప్రమత్తం చేసింది. ఇప్పటికే అన్ని కంపెనీల మసాలా ఉత్పత్తుల శాంపిళ్ల సేకరణ ప్రక్రియ ప్రారంభమైనట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. మూడు నాలుగు రోజుల్లోగా దేశంలోని అన్ని ప్రముఖ కంపెనీల మసాలా ఉత్పత్తుల తయారీ యూనిట్ల నుంచి శాంపిళ్ల సేకరణ పూర్తవుతుందని తెలిపాయి. వాటిని ల్యాబ్‌కు పంపించాక.. తనిఖీ రిపోర్టు రావడానికి 20 రోజుల టైం పడుతుందని పేర్కొన్నాయి. ఎవరెస్ట్, ఎండీహెచ్ మసాలా ఉత్పత్తుల్లో 'ఇథిలీన్ ఆక్సైడ్' మూలాలను గుర్తించారు. ఇది 10.7 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ ఉష్ణోగ్రతల వద్ద మండే స్వభావాన్ని కలిగిన రంగులేని వాయువు అని సుగంధ ద్రవ్యాల బోర్డు నిర్వచించింది. ఇథిలీన్ ఆక్సైడ్ అనేది క్రిమిసంహారకంలా, ధూమపాన ఉత్పత్తిలా, స్టెరిలైజింగ్ ఏజెంట్‌లా ప్రతికూల ప్రభావాలను కలగజేస్తుందని అంటారు. వైద్య పరికరాలను క్రిమిరహితం చేయడానికి, సుగంధ ద్రవ్యాలలోని సూక్ష్మజీవుల కాలుష్యాన్ని తగ్గించడానికి ఇథిలీన్ ఆక్సైడ్‌ను వాడుతుంటారు. దీన్ని సహజ వనరులతో పాటు నీటితో నిండిన నేల, పేడ, బురదల నుంచి ఉత్పత్తి చేయొచ్చు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ)కు చెందిన ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ రీసెర్చ్ ఆన్ క్యాన్సర్ (ఐఏఆర్సీ) ఇథిలీన్ ఆక్సైడ్‌ను గ్రూప్ 1 కార్సినోజెన్‌గా వర్గీకరించింది. అంటే.. దీనివల్ల మనుషుల్లో క్యాన్సర్‌కు కారణమయ్యే రిస్క్ ఉంటుంది.

## వేసవిలో చెమటకాయలు రాకుండా ఉండాలంటే....!



వేసవి కాలం వచ్చిందంటే వేడి, చెమటలు, ఇక చెమటకాయలు కూడా వస్తాయన్న విషయం తెలిసిందే.. అయితే మనం ఎంత జాగ్రత్తలు తీసుకున్నా కూడా ఏదొక సమస్యలు వెంటాడుతుంటాయి..చెమటకాయలు, దురదలు ఎక్కువగా ఇబ్బంది పెడతాయి.. వీటినుంచి బయట పడాలంటే కొన్ని టిప్స్ ఫాలో అవ్వాలని నిపుణులు చెబుతున్నారు.. ఇక ఆలస్యం లేకుండా ఆ టిప్స్ ఏంటో తెలుసుకుందాం.. చర్మ సమస్యలతో బాధపడే వారు ముల్తానీ మట్టిని వాడడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. మనకు కావల్సినంత ముల్తానీ మట్టిని నీటిలో వేసి ఒక గంట పాటు నానబెట్టాలి. తరువాత నీటిని తీసేసి ఇందులో చందనం పొడి వేసి కలపాలి.. ఆ తర్వాత శరీరం పై, ముఖానికి అప్లై చేసి ఆరాక కడిగేసుకుంటే బాగా చల్లగా అవ్వడం మాత్రమే కాదు.. చెమటకాయలు వెంటనే తగ్గిపోతాయి.. ఇక వేపాకులు యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాలను కలిగి ఉంటాయి. వేప నీటితో స్నానం చేయడంతో వేప కాయల రసాన్ని లేదా నూనెను రాసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. అలాగే వేప ఆకులను పేస్ట్ గా చేసి చర్మంపై కూడా రాసుకోవచ్చు. చివరగా సోడా ఉప్పును కొద్దిగా తీసుకొని నీళ్లు పోసి బాగా కలపాలి.. ఆ మిశ్రమాన్ని దురదలు ఎక్కువగా ఉన్న దగ్గర పూతలాగా రాసుకోవాలి.. ఆరిన తర్వాత చల్లని నీళ్లతో కడిగేసుకుంటే చాలు ఎండాకాలంలో వచ్చే చర్మ సమస్యలు మాయం అవుతాయి.

## కళ్లు ఉప్పు వాడుతున్నారా...?




వంటల్లో సుగంధ ద్రవ్యాలను వాడినా, ఖరీదైన మసాలాలను వాడినా కూడా ఉప్పు, కారం సరిగ్గా సరిపోకుంటే మాత్రం రుచిగా ఉండదు.. ఉప్పును సరిపడా వేసుకుంటేనే ఆ వంటలు రుచిగా ఉంటాయి.. అయితే కొంతమంది సాల్ట్ ను వాడితే, మరికొందరు కళ్లు ఉప్పును ఎక్కువగా వాడుతారు.. అయితే కళ్లు ఉప్పును వాడే వారు కొన్ని విషయాలను తప్పక తెలుసుకోవాలని నిపుణులు చెబుతున్నారు.. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం..ఈ ఉప్పును ఎక్కువగా ఆయుర్వేద మందుల తయారీలో ఉపయోగిస్తున్నారు. ఈ ఉప్పులో మెగ్నీషియం, పొటాషియం ఎక్కువగా ఉంటాయి. జీర్ణక్రియ మెరుగు పరిచి తీసుకున్న ఆహారం బాగా జీర్ణం అయ్యేలా చేసి కడుపుకు సంబంధించిన సమస్యలు ఏమీ లేకుండా చేస్తుంది.. ఈ ఉప్పులో ఉండే పోటాషియం రక్త పోటును నియంత్రిస్తుంది.. శరీరంలో రోగనిరోధక వ్యవస్థ బలంగా ఉండేలా చేస్తుంది.. అలాగే నిద్రలేమి సమస్యలను తగ్గిస్తుంది. ఈ ఎండాకాలంలో డీహైడ్రేషన్ అవ్వకుండా చేస్తుంది.. ఒక గ్లాస్ గోరువెచ్చని నీటిలో అర స్పూన్ ఉప్పును కలిపి బాగా కరిగాక తాగితే మానసిక ఒత్తిడి దూరమై ప్రశాంతత కలుగుతుంది.

## ఉల్లి రసం తాగితే ఎన్ని లాభాలో...!

నిత్యం ప్రతి ఒక్కరి ఇంట్లో వాడే కూరగాయల్లో ఉల్లిపాయలు ఒకటి. ఉల్లిపాయ లేనిదే ఏ కూర చేయలేరు. వేల సంవత్సరాల నుంచి ఉల్లిపాయను వాడుతున్నాము.ఉల్లిపాయలో అనేక రకాల విటమిన్స్, మినరల్స్ తో పాటు ఆరోగ్యానికి అత్యంత మేలు చేసే సమ్మేళనాలు నిండి ఉంటాయి. అందువల్ల ఆరోగ్యపరంగా ఉల్లిపాయ అపారమైన ప్రయోజనాలను చేకూరుస్తుంది. ముఖ్యంగా ఖాళీ కడుపుతో ఉల్లి రసం తాగితే ఎన్నో అద్భుతమైన హెల్త్ బెనిఫిట్స్ పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు. అందుకోసం ఒక చిన్న ఉల్లిపాయను తీసుకుని ముక్కలుగా కట్ చేసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి.గ్రైండ్ చేసుకున్న మిశ్రమం నుంచి జ్యూస్ ను సపరేట్ చేసుకోవాలి. ఒక చిన్న కప్పు ఉల్లి రసంలో వన్ టేబుల్ స్పూన్ తేనె కలిపి ఖాళీ కడుపుతో తీసుకోవాలి. మూత్రపిండాల్లో రాళ్లు ఉన్నవారు నిత్యం ఇలా చేశారంటే చాలా మేలు జరుగుతుంది. కిడ్నీలో రాళ్లు క్రమంగా కరుగుతాయి. అలాగే ఖాళీ కడుపుతో ఉల్లి రసం తీసుకోవడం వల్ల కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం పొందుతారు. ఉల్లిపాయలో కాల్షియం మెండుగా ఉంటుంది. కాల్షియం ఎముకలను బలోపేతం చేస్తుంది. రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. ఉల్లిపాయల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు రోగ నిరోధక శక్తిని బలోపేతం చేయడంలో మీకు సహాయపడతాయి. ఉల్లిపాయల యొక్క అతిపెద్ద ప్రయోజనాల్లో ఇది ఒకటి. మధుమేహం ఉన్న వారు ఖాళీ కడుపులో తేనె కలపకుండా ఉల్లి రసం తీసుకుంటే రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. అంతేకాకుండా బెల్లీ ఫ్యాట్‌తో బాధపడుతున్నవారు ఉదయాన్నే ఉల్లి రసం తీసుకుంటే చాలా మంచిది. ఉల్లి రసం పొట్ట చుట్టూ పేరుకుపోయిన కొవ్వును క్రమంగా కరిగిస్తుంది. అందువల్ల ఆరోగ్యపరంగా ఉల్లిపాయ అపారమైన ప్రయోజనాలను చేకూరుస్తుంది. ముఖ్యంగా ఖాళీ కడుపుతో ఉల్లి రసం తాగితే ఎన్నో అద్భుతమైన హెల్త్ బెనిఫిట్స్ పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు. అందుకోసం ఒక చిన్న ఉల్లిపాయను తీసుకుని ముక్కలుగా కట్ చేసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి.



## జొన్న రొట్టెలు తినడం వల్ల లాభాలు..!



మన చుట్టూ పండేటువంటి వాటిలో కూడా ఆరోగ్యానికి చాలా మేలు చేసే తృణధాన్యాలు కూడా ఉంటాయి. ముఖ్యంగా ఈ ధాన్యాల వల్ల మనకు చాలా లాభాలు కూడా ఉంటాయి. అలాంటి వాటిలో జొన్నలు కూడ ఒకటి.చాలా మంది వీటితో రొట్టెలు వంటివి చేసుకుంటూ ఉంటారు. ఎక్కువగా షుగర్ వ్యాధిగ్రహస్తులు కూడా వీటిని తింటూ ఉంటారు. ఈ జొన్నల వల్ల మనం అధిక రక్తపోటు సమస్యలను మలబద్ధకం ఇతరత్తర సమస్యలను కూడా నివారించుకోవచ్చు.జొన్నలు ఎక్కువగా ఆఫ్రికా వంటి ప్రాంతాలలో ఎక్కువగా పండుతాయి. జొన్న పిండితో తయారు చేసిన వంటలను తినడం వల్ల మరిన్ని లాభాలు కలుగుతాయి. ముఖ్యంగా జీర్ణ క్రియ మెరుగుపడడం గుండెపోటు రాకుండా ఉండడం బరువు తగ్గడం వంటి వాటికి ఉపయోగపడుతూ ఉంటాయి. జొన్నలలో ఎక్కువగా ప్రోటీన్ ఫైబర్ వంటివి లభిస్తాయి. అలాగే యాంటీ ఆక్సిడెంట్లు ఫినాలిక్ సమ్మేళనాలు వంటివి ఈ జొన్నలలో లభిస్తాయి. శరీరంలోని కొండే పేగుల కదలికలను కూడా చురుకుగా చేయడంలో కీలకపాత్ర పోషిస్తాయి. ఫైబర్, గట్ వంటి బ్యాక్టీరియాను అభివృద్ధి చేయడానికి ఈ జొన్నలు సహాయపడతాయి. జొన్నలతో తయారు చేసినటువంటి ఆహారాన్ని తినడం వల్ల ఎముకలు దృఢంగా మారుతాయి. శరీరంలో ఉండే వ్యర్థ కొవ్వు పదార్థాలను నియంత్రించడానికి చాలా సహాయపడతాయి.


జొన్న లో ఉండే ఫినాలి యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలో ఉండేటువంటి మంట అధిక ఒత్తిడిని సైతం తగ్గించడానికి సహాయపడతాయి. ముఖ్యంగా జొన్న రొట్టెలను తినడం వల్ల అధిక బరువు సమస్య నుంచి బయటపడవచ్చు ఇందులో ఉండే ఫైబర్ ప్రోటీన్ ల వల్ల ఎక్కువ లాభాలు ఉంటాయి. కాబట్టి ఐదు సంవత్సరాల పైబడిన పిల్లలు కూడా వీటిని తినడం మరింత మంచిది. జొన్న రొట్టెలు కాల్చేటప్పుడు కాస్త నువ్వు గింజలు కూడా రొట్టెల మీద చల్లుకొని తినడం వల్ల మరింత టేస్ట్ గా ఉంటాయి. వీటితోపాటు మరిన్ని పోషకాలు కూడా లభిస్తాయట.

## ఎండాకాలంలో బెల్లంను తింటున్నారా?



ఎండాకాలం వచ్చేసింది.. ఎండలు మండిపోతున్నాయి.. ఆహారం విషయంలో కూడా జాగ్రత్తలు తీసుకోవాలి.. నీటిశాతం ఎక్కువగా ఉండే కాయలను తీసుకోవడంతో పాటుగా సమయానికి తీసుకోవాలి..నీటిని కూడా ఎక్కువగా తీసుకోవాలి.. అయితే ఎండాకాలంలో బెల్లం తీసుకుంటే వేడి అని కొందరు నమ్ముతారు.. కానీ నిపుణులు ఎం చెబుతున్నారో ఇప్పుడు తెలుసుకుందాం..బెల్లం ఆరోగ్యానికి చాలా మంచిది.. అందుకే రోజుకు ఒక ముక్క బెల్లంను తీసుకుంటే ఆరోగ్యానికి చాలా మంచిదని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.. కొందరు బెల్లంను టీలో వేసుకొని తాగుతారు.. మరికొంత మంది బెల్లంను నీళ్లలో కలుపుకొని తాగుతారు.. ఎలా తీసుకున్నా ఆరోగ్యానికి మంచిదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.. రక్త హీనత సమస్య నుంచి బయట పడేస్తుంది.. రక్తంలో హేమోగ్లోబిన్ శాతాన్ని పెంచుతుంది.

## కంటి ఆరోగ్యం మెరుగుపడాలంటే?



ఈ రోజుల్లో చాలా మందికి కూడా చిన్న వయసులోనే కంటి సమస్యలు వస్తున్నాయి. అందుకే క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి. ఎందుకంటే కంటి పరీక్షలు చేయించుకోవడం వల్ల ఏవైనా కంటి సమస్యలు ఉంటే మనం స్టార్టింగ్ స్టేజ్ గుర్తించవచ్చు. దీంతో మనం తగిన జాగ్రత్తలు తీసుకోవడం వల్ల సమస్య మరింత తీవ్రతరం కాకుండా ఉంటుంది. ముఖ్యంగా మన చేతులతో తరుచూ కళ్లను తాకకూడదు. కళ్లను రుద్దకూడదు. అవసరమైతే మన చేతులను శుభ్రంగా కడిగి ఆ తరువాత కళ్లను తాకడం మంచిది. చేతులపై అనేక రకాల వైరస్, బ్యాక్టీరియాలు ఉండే అవకాశం ఉంటుంది. అదే చేతులతో కళ్లను తాకడం వల్ల కంటికి ఇన్ఫెక్షన్ లు వచ్చే అవకాశం ఉంది. కనుక చేతులను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకోవడం మంచిది. అలాగే కళ్ళు పొడిబారకుండా ఉండడానికి గానూ రోజూ తగినన్ని నీళు తాగడం చాలా అవసరం. నీరు తాగడం వల్ల కళ్లు పొడిబారకుండా ఉండడంతో పాటు కళ్ల ఎరుపుదనం కూడా తగ్గుతుంది. అలాగే రోజూ కంటి వ్యాయామాలు చేయడం కూడా చాలా అవసరం.కంటి వ్యాయామాలు చేయడం వల్ల కంటి కండరాలు బలంగా తయారవుతాయి. దీంతో కంటిచూపు మెరుగుపడుతుంది.కంటి ఆరోగ్యం మెరుగుపడి దృష్టి లోపాలు తగ్గాలంటే టివి, సెల్ ఫోన్ వంటి వస్తువుల వాడకాన్ని తగ్గించడంతో పాటు సరైన ఆహారాన్ని తీసుకోవడం కూడా చాలా ముఖ్యం. కంటి ఆరోగ్యం మరియు చూపు మెరుగుపడాలంటే మనం తీసుకోవాల్సిన ఆహారాలతో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కూడా ఇప్పుడు తెలుసుకుందాం. కంటి ఆరోగ్యం మెరుగుపడాలంటే పోషకాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం చాలా ముఖ్యం. క్యారెట్, ఆకుకూరలు, సిట్రస్ పండ్లు, గింజలతో పాటు జింక్, కాపర్, విటమిన్స్, మినరల్స్ ఎక్కువగా ఉండే ఆహారాలను తీసుకోవడం చాలా ముఖ్యం.మన శరీరంలో కళ్లు ముఖ్యమైన అవయవాలు. ఇవి మన జీవితంలో చాలా ముఖ్య పాత్రను పోషిస్తాయని చెప్పవచ్చు. మన శరీర ఆరోగ్య కోసం ఎంత శ్రద్ధ తీసుకుంటామో మన కళ్ల ఆరోగ్యం గురించి కూడా అంతే శ్రద్ధ తీసుకోవాలి. కాబట్టి ఖచ్చితంగా పైన తెలిపిన జాగ్రత్తలు ఖచ్చితంగా తీసుకోండి. కళ్ళని ఆరోగ్యంగా ఉంచుకోండి.



# ఎప్పటికీ అలా అడగను




అప్పుడప్పుడూ అనువాద చిత్రాలతోనూ పలకరించేవాడు. కానీ 'సలార్' మూవీలో కీలక పాత్రతో పృథ్వీరాజ్‌కు మన దగ్గర వచ్చిన గుర్తింపే వేరు

తెలుగు వారికి ఈ మధ్య బాగా చేరువైన మలయాళ నటుడు పృథ్వీరాజ్. అతను తెలుగులో 'పోలీస్ పోలీస్' అనే డైరెక్ట్ మూవీ చేసిన విషయం జనాలకు పెద్దగా తెలియదు. అప్పుడప్పుడూ అనువాద చిత్రాలతోనూ పలకరించేవాడు. కానీ 'సలార్' మూవీలో కీలక పాత్రతో పృథ్వీరాజ్‌కు మన దగ్గర వచ్చిన గుర్తింపే వేరు. ఇప్పుడతను తన డ్రీమ్ ప్రాజెక్ట్ అయిన 'ది గోట్ లైఫ్: ఆడుజీవితం'ను ఒకేసారి మలయాళంతో పాటు బహు భాషల్లో రిలీజ్ చేస్తున్నాడు. అందులో తెలుగు వెర్షన్ కూడా ఉంది. దీన్ని ప్రమోట్ చేసే విషయంలో పృథ్వీరాజ్ ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాడు. హైదరాబాద్‌కు తన టీంతో విచ్చేసి అనేకమంది సినీ ప్రముఖులకు స్పెషల్ షో వేయడమే కాక.. ప్రెస్ మీట్ పెట్టాడు. అలాగే మీడియాకు వన్ టు వన్ ఇంటర్వ్యూలు కూడా ఇచ్చాడు. హీరోయిన్ ను సీక్రెట్ గా పెళ్లి చేసుకున్న హీరో సిద్ధార్థ్! ఐతే 'సలార్'లో తాను స్క్రీన్ చేసుకున్న ప్రభాస్‌నే పిలిచి ప్రమోషన్లకు ఉపయోగించుకుని ఉంటే సినిమాకు బాగా ఉపయోగపడేదనే అభిప్రాయం చాలామందిలో వ్యక్తమైంది. ఇదే విషయం ఓ ఇంటర్వ్యూలో అడిగితే.. పృథ్వీరాజ్ ఇచ్చిన సమాధానం విని హ్యాట్సాఫ్ అనకుండా ఉండలేరు. "నేను ప్రభాస్‌ను పిలిస్తే అతను నో చెప్పలేడు. కచ్చితంగా ప్రమోషనల్ ఈవెంట్‌కు వస్తాడు. కానీ అతను నో అనలేడు కాబట్టే నేను తనను పిలవలేను. స్నేహం ఉంది కదా అని మొహమాటపెట్టి సినిమాల ప్రమోషన్ల కోసం వాడుకోకూడదు. ఇప్పుడే కాదు.. నేనెప్పుడు ప్రభాస్‌ను నా సినిమా ప్రమోషన్ కోసం పిలవను. నేనొక మంచి సినిమా చేశాను. దాన్ని ప్రమోట్ చేయడానికి మీడియా, ప్రేక్షకులు చాలు. సినిమా నచ్చితే ప్రేక్షకులు చూస్తారు' అని పృథ్వీరాజ్ చక్కటి సమాధానం చెప్పాడు. 'ది గోట్ లైఫ్' ఈ గురువారమే ప్రేక్షకుల ముందుకు వస్తోంది.


# సుగుణసుందరి అవతారం

అవును.. ఇది సడెన్ ట్విస్ట్.. ఊహించని ట్విస్ట్.. వరుసగా కథానాయికలు వధువులుగా మారుతున్నారు. నచ్చినవాడిని పెళ్లాడేస్తున్నారు. వరుసగా కథానాయికలు వధువులుగా మారుతున్నారు. నచ్చినవాడిని పెళ్లాడేస్తున్నారు. కానీ చాలా కాలంగా తమన్నా పెళ్లి గురించి అడిగితే దాటవేస్తోంది. ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదు. తన ప్రియుడు విజయ్ వర్మతో డేట్ గురించి మాత్రమే మాట్లాడుతోంది కానీ, పెళ్లి గురించి ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. చూస్తుంటే ఇక తమన్నాకు కూడా లగ్గం పెట్టే సమయం ఆసన్నమైందని నెటిజనుల్లో గుసగుస ఆగడం లేదు. అయితే ఇంతలోనే ఒక సడెన్ ట్విస్ట్. తమన్నా వధువుగా మారింది. బ్రైడల్ దుస్తుల్లో ఫోటోషూట్ లో పాల్గొంది. ప్రస్తుతం ఈ ఫోటోగ్రాఫ్స్ అంతర్జాలంలో దుమారం రేపుతున్నాయి. అయితే తమన్నా నిజంగానే పెళ్లికూతురు అవుతోందా? అంటూ అభిమానులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. తమన్నా పెళ్లికూతురు అయిన మాట నిజమే కానీ, ఇది కేవలం డిజైనర్ షో కోసం మాత్రమే. ఇది కేవలం ఒక అందమైన డిజైనర్ ఫోటోషూట్. ప్రఖ్యాత డిజైనర్ రాహుల్ మిశ్రా రూపొందించిన బ్రైడల్ డిజైనర్ దుస్తుల్లో తమన్నా ముగ్ధ మనోహర రూపం కట్టి పడేస్తోంది. రకరకాల డిజైనర్ దుస్తుల్లో తమన్నా వధువు అవతార్ మతులు చెడగొడుతోంది. ఇందులో ఒక ఫోటోగ్రాఫ్ లో తమన్నా మత్స్యకన్య అవతారంలోను కనిపించింది. ఈ లుక్ నిజంగా స్టన్నింగ్. నేలమీదికి జాలువారుతూ పొడవాటి డిజైనర్ లెహంగాలో తమన్నా విరహాన్ని ప్రదర్శిస్తున్న మరో ఫోటోగ్రాఫ్ కూడా వేడి పెంచుతోంది. వీటికి భిన్నంగా బుట్ట బొమ్మ అవతారంలో భారీతనం నిండిన డిజైనర్ ఫ్లోరల్ టాప్ లోను తమన్నా ఎంతో అందంగా కనిపించింది. ఈ ఫోటోషూట్ లో తమన్నా బెస్ట్ గెటప్స్ యూత్ ని ఆకర్షిస్తున్నాయి. మరోవైపు తమన్నా కెరీర్ పరంగా సెలక్టివ్ గా ముందుకు సాగుతోంది. కెరీర్ మ్యాటర్ కి వస్తే తమన్నా ఓదెలా 2లో నటిస్తోంది. ఇటీవల మహా శివరాత్రి 2024 నాడు తమన్నా నటిస్తున్న చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైంది. హర్ హర్ మహాదేవ్! హ్యాపీ మహా శివరాత్రి అంటూ పోస్టర్ కి క్యాప్షన్ ని కూడా ఇచ్చింది తమన్నా పోస్టర్‌లో తమన్నా సాధువు అవతారంలో కనిపించి ఆశ్చర్యపరిచింది. ఒక చేతిలో పవిత్రమైన శంఖం .. మరో చేతిలో డ్రమ్‌ని పట్టుకుని వింతగా కనిపించింది.



రెండే రెండు సినిమాలతో పాన్ ఇండియా లెవెల్‌లో ఫేమస్ అయ్యారు తెలుగు దర్శకుడు సందీప్ రెడ్డి వంగా రెండే రెండు సినిమాలతో పాన్ ఇండియా లెవెల్ లో ఫేమస్ అయ్యారు తెలుగు దర్శకుడు సందీప్ రెడ్డి వంగా. అర్జున్ రెడ్డి, యానిమల్ మూవీలతో ఓ రేంజ్ లో గుర్తింపు సంపాదించుకున్నారు. అర్జున్ రెడ్డి సినిమాను బాలీవుడ్ లో కబీర్ సింగ్ పేరుతో రీమేక్ అక్కడ కూడా బ్లాక్ బస్టర్ హిట్ కొట్టారు. ఇటీవల యానిమల్ సినిమాతో సందీప్ రెడ్డి వంగా ఎలాంటి సంచలనం సృష్టించారో అందరికీ తెలిసిందే. బాలీవుడ్ స్టార్ నటుడు రణబీర్ సింగ్, నేషనల్ క్రష్ రష్మిక మందన్న హీరోహీరోయిన్లుగా నటించిన ఈ సినిమా..

# ఇప్పుడు ప్రొడ్యూసర్‌గా...



వరల్డ్ వైడ్‌గా రూ.900 కోట్లకుపైగా రాబట్టింది. ఇండియన్ బాక్సాఫీస్ వద్ద అనేక రికార్డులు కొల్లగొట్టింది. మేకర్స్‌కు రూ. కోట్లలో లాభాలు తెచ్చిపెట్టింది. సినిమా విషయంలో అనేక విమర్శలు వచ్చినా.. తగ్గేదేలే అంటూ దూసుకెళ్లింది. ఆ తర్వాత ఓటీటీలోకి కూడా వచ్చి రికార్డులు తిరగరాసింది. ఇక సందీప్ నెక్స్ట్ సినిమాలపై అందరి దృష్టి పడింది. ఆయన లైనప్ మామూలుగా లేదు. స్టార్ హీరోలతో వర్క్ చేయనున్నారు. పాన్ ఇండియా హీరో ప్రభాస్ తో స్పిరిట్ మూవీ తీయనున్నారు. అందుకు సంబంధించిన స్క్రిప్ట్ పై ప్రస్తుతం వర్క్ చేస్తున్నారు. ఈ సినిమాపై ఇప్పటికే మూవీ లవర్స్ లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తో కూడా సినిమా చేయనున్నారు. అయితే సందీప్.. ఇప్పుడు తెలుగు చిత్రాలను నిర్మించే ఆలోచనలో ఉన్నారట. అందుకు గాను హైదరాబాద్ లో ఓ ఆఫీస్ కూడా ఇటీవల స్టార్ట్ చేశారట. స్క్రిప్టులను పరిశీలించడానికి ఓ స్పెషల్ టీమ్ ను కూడా ఏర్పాటు చేశారట. సందీప్ రెడ్డి వంగా ఫైనల్ చేశాకే.. ఆ స్క్రిప్ట్ ఓకే అవుతుందట. టాలీవుడ్ కు అనేక మంది యంగ్ అండ్ టాలెంటెడ్ డైరెక్టర్లను పరిచయం చేయాలనే ఉద్దేశ్యంతో ఇలా చేస్తున్నారట. ఇప్పటి వరకు ఇంకా ఒక్క స్క్రిప్ట్ కూడా సందీప్ రెడ్డి వంగా ఓకే చేయలేదట. కానీ 2024 ముగిసేలోపు రెండు తెలుగు సినిమాలు ప్రకటించాలని ఫిక్స్ అయ్యారట. అందుకు తగ్గట్లు ప్లాన్ చేస్తున్నారట. త్వరలోనే సందీప్ స్పిరిట్ మూవీ షూటింగ్ స్టార్ట్ చేయనున్నారట. అయితే అక్టోబర్ లో షూటింగ్ మొదలవుతుందనుకున్నా.. కొద్ది రోజులు లేట్ అవ్వొచ్చని తెలుస్తోంది. మరి సందీప్ నిర్మాతగా తొలి మూవీ ఎప్పుడు ప్రకటిస్తారో చూడాలి.

# జరగండి పాటకు అన్నీ కోట్లు ఖర్చు చేశారా?



కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో రామ్ చరణ్.. గేమ్ ఛేంజర్ మూవీ చేస్తున్న విషయం తెలిసిందే. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో రామ్ చరణ్.. గేమ్ ఛేంజర్ మూవీ చేస్తున్న విషయం తెలిసిందే. స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం చివర దశలో ఉంది. ఎప్పుడో మూడేళ్ల క్రితం పట్టాలెక్కిన ఈ మూవీ.. ఇప్పటికీ షూటింగ్ జరుపుకుంటూనే ఉంది. అప్పుడెప్పుడో టైటిల్ అనౌన్స్మెంట్, ఫస్ట్ లుక్ రిలీజ్ చేసిన మేకర్స్.. తాజాగా చెర్రీ పుట్టిన రోజు నాడు మరో అప్డేట్ ఇచ్చారు. గత ఏడాది దీపావళికి రిలీజ్ చేస్తామని ప్రకటించిన జరగండి సాంగ్‌ను నేడు రిలీజ్ చేశారు గేమ్ ఛేంజర్ మేకర్స్. తమన్ సంగీతం అందించిన ఈ సాంగ్.. గతంలో సోషల్ మీడియాలో లీక్ అయిన విషయం తెలిసిందే. అప్పుడు వేరే సింగర్స్ తో పాడించిన ఈ సాంగ్‌ను ఇప్పుడు.. దలేర్ మెహిందీ, సునీత చౌహాన్ తో తమన్ పాడించారు. ఈ లిరికల్ సాంగ్‌లో హీరోహీరోయిన్లు రామ్ చరణ్, కియారా అద్వానీ స్టైలిష్‌గా స్టెప్పులు వేసి అదరగొట్టారు. అయితే జరగండి జరగండి పాటకు ప్రముఖ డ్యాన్స్ మాస్టర్ ప్రభుదేవా కొరియోగ్రఫీ చేశారు. ఈ సాంగ్ కు మేకర్స్.. ఏకంగా రూ.16 కోట్లు నుంచి రూ.18 కోట్లు ఖర్చు చేశారని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ఇక పాట బ్యాక్ గ్రౌండ్ లో కనిపిస్తున్న కలర్ ఫుల్ భవనాలు సెట్సే కానీ.. ఒరిజినల్ లొకేషన్స్‌లా అనిపిస్తున్నాయి. సెట్స్ తోపాటు గ్రాఫిక్స్ కోసమే భారీ మొత్తంలో మేకర్స్ ఖర్చు పెట్టినట్లు తెలుస్తోంది. శంకర్ చేస్తున్న ఫస్ట్ తెలుగు మూవీ గేమ్ ఛేంజర్ కావడం గమనార్హం. ఇప్పటికే భారతీయుడు, ఒకే ఒక్కడు వంటి పలు డబ్బింగ్ సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువయ్యారు శంకర్. వినయ విధేయ రామ సినిమా తర్వాత మరోసారి రామ్ చరణ్ చరణ్, కియారా జంటగా ఈ మూవీలో యాక్ట్ చేస్తున్నారు. దాదాపు రూ. 200 కోట్ల బడ్జెట్ తో ఈ సినిమాను దిల్ రాజు నిర్మిస్తున్నట్లు సమాచారం. శంకర్ తెరకెక్కిస్తున్న ఈ పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ లో రామ్ చరణ్.. డ్యూయల్ రోల్ లో నటిస్తున్నారు. ఐపీఎస్ ఆఫీసర్ గా చరణ్ కనిపించబోతున్నట్లు సమాచారం. సెప్టెంబర్ లో ఈ మూవీ రిలీజ్ చేస్తామని ఇప్పటికే దిల్ రాజు... ప్రకటించారు. కానీ అఫీషియల్ అప్డేట్ మాత్రం ఇప్పటి వరకు రాలేదు. ఈ మూవీ ఓటీటీ హక్కులను అమెజాన్ ప్రైమ్ వీడియో దక్కించు కున్న విషయం



కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న దేవర సినిమా పై జాన్వీ కపూర్ చాలా ఆశలు పెట్టుకుని ఎదురు చూస్తుంది.అతిలోక సుందరి శ్రీదేవి నట వారసురాలు జాన్వీ కపూర్ హీరోయిన్‌గా వరుస సినిమాలను టాలీవుడ్ లో చేసేందుకు రెడీ అవుతుంది. ఇప్పటికే ఎన్టీఆర్ తో దేవర సినిమాలో నటిస్తున్న విషయం తెల్సిందే. కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న దేవర సినిమా పై జాన్వీ కపూర్ చాలా ఆశలు పెట్టుకుని ఎదురు చూస్తుంది.మరో వైపు రామ్ చరణ్ కు జోడీగా బుచ్చిబాబు దర్శకత్వంలో జాన్వీ కపూర్ సినిమా చేస్తుంది. ఇటీవలే ఆ సినిమా పూజా కార్యక్రమాలు జరిగాయి. అందులో జాన్వీ పాల్గొనడం జరిగింది. తెలుగు లో రెండు సినిమాల్లో నటించడంతో పాటు మరో స్టార్ హీరో సినిమాలో ఐటెం సాంగ్ చేయబోతుందనే వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే దేవర సినిమా షూటింగ్ లో పాల్గొన్న జాన్వీ కపూర్ మళ్లీ ఎప్పుడెప్పుడు ఎన్టీఆర్ తో కలిసి సెట్స్‌లో అడుగు పెడతామా అంటూ ఎదురు చూస్తున్నట్లు పేర్కొంది. దేవరలో మళ్లీ తంగ పాత్ర చిత్రీకరణ కోసం ఇక ఏమాత్రం వేచి ఉండలేక పోతున్నాను అంటూ తన

# ఆగలేకపోతున్నా అంటున్న జాన్వీ

ఇన్ స్టాలో పేర్కొంది. ఎన్టీఆర్ తో కలిసి జాన్వీ కపూర్ చేస్తున్న దేవర సినిమా అక్టోబర్ లో విడుదల అవ్వబోతుంది. దేవర రెండు పార్ట్ లుగా రాబోతున్న విషయం తెల్సిందే. మొదటి పార్ట్ అక్టోబర్ లో విడుదల అవ్వనుండగా, రెండో పార్ట్ 2025 చివర్లో విడుదల అయ్యే అవకాశాలు ఉన్నాయి.ఇక రామ్ చరణ్ తో జాన్వీ కపూర్ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఈ సమ్మర్ లోనే ప్రారంభం అయ్యే అవకాశాలు ఉన్నాయి. శ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం రెండు సినిమాల్లో కూడా జాన్వీను అందమైన పల్లెటూరు అమ్మాయిగా చూడబోతున్నాం. హిందీలో ఇప్పటి వరకు దక్కని కమర్షియల్ హిట్ తెలుగు సినిమాలతో దక్కించుకుంటాను అనే నమ్మకంతో జాన్వీ కపూర్ కనిపిస్తుంది. తెలుగులో నటిస్తూనే మరో వైపు బాలీవుడ్ సినిమాల్లో కూడా ఈ అమ్మడు నటిస్తూ ఉంది.

# కల్కి గురించి కమల్ హాసన్..



ప్రభాస్ ప్రధాన పాత్రలో నటిస్తున్న కల్కి 2898 ఏడీ సినిమా మే 9న రిలీజ్ కాబోతుంది. అయితే తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో కమల్ హాసన్ ఈ సినిమాపై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. ప్రభాస్ నటిస్తున్న 'కల్కి 2898 సినిమాను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్నారు. మహానటి డైరెక్టర్ నాగ్ అశ్విన్ ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవల కల్కి టీమ్ ఇటలీలో ఓ షూటింగ్ షెడ్యూల్ ముగించింది. ప్రభాస్-దిశా పటానిపై ఓ రొమాంటిక్ సాంగ్‌ను చిత్రీకరించారు. ఇక ఈ చిత్రంలో కమల్ హాసన్ కూడా నటిస్తున్న సంగతి తెలిసిందే. అయితే తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఈ సినిమాపై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు కమల్ హాసన్.నా రోల్ ఇదే... ఈ భారీ బడ్జెట్ సినిమాలో తాను అతిథి పాత్రలో మాత్రమే నటిస్తున్నట్లు ఓ ఇంటర్వ్యూలో కమల్ క్లారిటీ ఇచ్చారు. అయితే చాలా మంది కమల్ ఈ సినిమాలో విలన్ పాత్రలో నటిస్తున్నారని ఊహించారు. కానీ వారందరికీ షాకిస్తూ కమల్ తాను గెస్ట్ రోల్ మాత్రమే చేస్తున్నానని చెప్పారు. అయితే ఇది విక్రమ్ సినిమాలో చివరిలో వచ్చే రోలెక్స్ పాత్రలా ఉంటుందేమో అంటూ ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. ఎందుకంటే విక్రమ్‌లో సూర్య చేసిన ఈ రోలెక్స్ పాత్ర కేవలం 5 నిమిషాలే ఉన్నా ఫ్యాన్స్‌కి మాత్రం తెగ నచ్చేసింది. తర్వాత పార్ట్‌పై భారీ అంచనాలు పెంచేలా చేసింది రోలెక్స్ క్యారెక్టర్. ఇక కమల్ పాత్ర కూడా అలానే ఉంటుందేమో అని ఆయన ఫ్యాన్స్ అనుకుంటున్నారు. ఇక ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్ మరో కీలక పాత్రలో నటిస్తున్నారు. దీపికా పదుకొణె హీరోయిన్‌గా నటిస్తుంది. ఇక దిశా పటానీ కూడా మరో కీలక రోల్‌లో కనిపిస్తుంది. అయితే తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికల కారణంగా కల్కి సినిమా వాయిదా పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కానీ మూవీ టీమ్ మాత్రం ఇప్పటివరకూ సినిమా రిలీజ్ వాయిదాపై ఎలాంటి అప్‌డేట్ ఇవ్వలేదు. మరి చిత్రాన్ని వాయిదా వేస్తారో లేక అనుకున్నట్లుగా మే 9న రిలీజ్ చేస్తారో చూడాలి. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌ని అశ్వినీ దత్ నిర్మిస్తున్నారు. సంతోష్ నారాయణన్ మ్యూజిక్ అందిస్తున్నారు.



# చరణ్‌కి గ్రాండ్ విషెస్!

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ పుట్టిన రోజు కావడంతో అభిమానుల విషెస్‌తో సోషల్ మీడియా షేక్ అవుతోంది మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ పుట్టిన రోజు కావడంతో అభిమానుల విషెస్ తో సోషల్ మీడియా షేక్ అవుతోంది. తమదైన శైలిలో అభిమానం చాటుతూ విషెస్ తెలియజేస్తున్న పోస్టులు నెట్టింట వైరల్ అవుతు న్నాయి. ఇక సెలబ్రిటీలు... సన్నిహితులు.. స్నేహితులు అంతా చరణ్‌కి శుభాకాంక్షలు తెలియ జేస్తున్నారు. ఇక ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ అయితే బావ చరణ్‌కి ఎంతో ప్రత్యేకంగా విషెస్ తెలియజేసారు. తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో చరణ్‌తో ఉన్న ఫోటోని షేర్ చేసి హ్యాపీ బర్త్ డే అంటూ విష్ చేసారు. ఇక్కడ చరణ్ వైట్ కలర్ షర్ట్ ప్యాంట్‌లో ఉండగా..బన్నీ మాత్రం బ్లాక్ దుస్తుల్లో నవ్వుతూ కనిపిస్తున్నారు. ఇది పబ్‌లో దిగిన ఫోటో లా ఉంది. బర్త్ డ్ పార్టీ ఎంజాయ్ చేస్తోన్న సమయంలో క్యాప్చర్ చేసిన పిక్ ఇది. మరి ఈపార్టీలో ఇంకా ఎవరెవరు? ఉన్నారు? అన్నది తెలియాలి. ప్రస్తుతం ఈ పిక్ నెట్టింట వైరల్‌గా మారింది. చరణ్..బన్నీ అభిమానుల్ని విపరీతంగా ఆకట్టుకుంటుంది. బావ-బావమర్ది ఇద్దరు ఒకే ఫ్రేమ్‌లో అంటూ ఫన్నీ కామెంట్లు పోస్ట్ చేస్తున్నారు. నేడు ఇద్దరు పాన్ ఇండియా స్టార్లే! కదా మరి ఆ ఇద్దరు కలిసి సినిమా చేసేది? ఎప్పుడంటూ ఓ నెటి జనుడు పోస్ట్ చేసాడు. వాళ్లిద్దరు కలిసి నటించాలని అల్లు అరవింద్ కూడా అంతే కోరుకుంటున్నారు. ఇద్దరి కోసం ఇప్పటికే చరణ్- అర్జున్ అంటూ ఓ టైటిల్ కూడా రిజిస్టర్ చేయించిన సంగతి తెలిసిందే. ఆ కాంబినేషన్‌ని అరవింద్ గారే నిర్మిస్తే అంతకు మించిన సంతోషం ఏముంటుంది.

# పిలిస్తే ప్రచారం చేస్తా..



పవన్ కళ్యాణ్ పిలిస్తే జనసేన పార్టీకి ప్రచారం చేస్తానని అన్నారు యాంకర్ అనసూయ భరద్వాజ్. మెగా అభిమానుల్ని, జన సైనికుల్ని ప్రసన్నం చేసుకునే వార్త చెప్పింది అనసూయ భరద్వాజ్. సొసైటీపై సినిమా ప్రభావం ఎక్కువగా ఉంటుందని.. కాబట్టి సొసైటీలో ఉంటున్న తనకీ ఓ మంచి నాయకుడ్ని ఎన్నుకునే బాధ్యత ఉందని.. కాబట్టి తాను చెప్తే వినేవాళ్లు ఉండటం తన అదృష్టం అని అన్నారు అనసూయ.తాజా ఇంటర్వ్యూలో అనసూయ మాట్లాడు తూ.. 'ఇది వివాదం అవ్వొచ్చు కానీ.. అడిగారు కాబట్టి చెప్తున్నా. నేను తప్పు ఉండొచ్చు. నాకు లీడర్స్‌తోనే పని. పొలిటికల్ పార్టీలతో కాదు. పవన్ కళ్యాణ్ గొప్ప నాయకుడు. ఆయన ప్రచారం చేయమని పిలిస్తే తప్పకుండా వెళ్తాను. జబర్దస్త్‌లో రోజా, నాగబాబు ఇద్దరితో కలిసి పనిచేశాను. నాకు నాగబాబు గారు బాగా క్లోజ్. ఒకవేళ అటు నుంచి రోజా గారూ.. ఇటు నుంచి నాగబాబు గారూ పార్టీలోకి పిలిస్తే.. వాళ్లు ఇద్దరూ పిలుపునిస్తే.. ఆ రెండు పార్టీల్లోకి వెళ్తాను. కానీ అది నా జాబ్ కాదు. నేను ఏది నమ్ముతానంటే.. నా అజెండాని బట్టి నేను సపోర్ట్ చేస్తాను. నాకు రాజకీయాలంటే ఇష్టం లేదు. మా నాన్న గారు రాజకీయాల్లో ఉండేవారు. ఆయన పాలిటిక్స్ మానేయడానికి కారణం నేనే. మంచి లీడర్‌ని ఎన్నుకోమని నేనే వేరే వాళ్లకి చెప్పడం వాళ్లు నా వినడం అది నా అదృష్టం. నేను చెప్తే వింటారు కాబట్టి.. కరెక్ట్‌గా చెప్పాలి. నేను చెప్తే వింటారని ఏది పడితే అది చెప్పడం తప్పు. సినిమా అనేది చాలా ఇంపాక్ట్ చేస్తుంది.

# జొమాటో కీలక నిర్ణయం.. 25 శాతం ప్లాట్ ఫామ్ ఫీజు పెంపు.. ఇక ఆ సర్వీసుకు రాంరాం..!

ప్రముఖ ఫుడ్ డెలివరీ యాప్ 'జొమాటో ఫుడ్ డెలివరీ ఫీజు 25 శాతం పెంచింది. ప్రతి ఫుడ్ ఆర్డర్ మీద రూ.5 చొప్పున పెంచుతున్నట్లు ప్రకటించింది. పెంచిన ఫీజు ఈ నెల 20 నుంచే అమల్లోకి వచ్చింది. ఢిల్లీ-దేశ రాజధాని ప్రాంతం (ఎన్సీఆర్), బెంగళూరు, ముంబై, హైదరాబాద్, లక్నో వంటి నగరాల్లో కస్టమర్ల నుంచి పెంచిన ఫీజు వసూలు చేస్తున్నది. మరో ఫుడ్ డెలివరీ ప్లాట్ ఫామ్ 'స్విగ్గీ సైతం ఒక్కో ఆర్డర్ డెలివరీకి రూ.5 చొప్పున పెంచి వసూలు చేస్తున్నది. ఇంతకుముందు డిసెంబర్ 31న ఒక్కో ఆర్డర్ మీద ప్లాట్ ఫామ్ ఫీజు తాత్కాలికంగా రూ.9లకు పెంచి వసూలు చేసింది. గతేడాది ఆగస్టులో మొదటిసారి జొమాటో తన ప్లాట్ ఫామ్ ఫీజు అమల్లోకి తెచ్చింది. ప్రారంభంలో ప్రతి ఆర్డర్ మీద రూ.2 చొప్పున వసూలు చేసిన జొమాటో.. గత అక్టోబర్ నెలలో రూ.3, జనవరిలో రూ.4లకు పెంచేసింది. ఇప్పుడు తాజాగా ప్లాట్ ఫామ్ ఫీజు రూ.5 చేసింది. ఫుడ్ డెలివరీ యాప్స్ సాధారణంగా ఫుడ్, డెలివరీ చార్జీ వసూలు చేస్తాయి. ప్రతి ఫుడ్ ఆర్డర్ మీద రూ.5 చొప్పున పెంచుతున్నట్లు ప్రకటించింది. పెంచిన ఫీజు ఈ నెల 20 నుంచే అమల్లోకి వచ్చింది. ఢిల్లీ-దేశ రాజధాని ప్రాంతం (ఎన్సీఆర్), బెంగళూరు, ముంబై, హైదరాబాద్, లక్నో వంటి నగరాల్లో కస్టమర్ల నుంచి పెంచిన ఫీజు వసూలు చేస్తున్నది. మరో ఫుడ్ డెలివరీ ప్లాట్ ఫామ్ 'స్విగ్గీ సైతం ఒక్కో ఆర్డర్ డెలివరీకి రూ.5 చొప్పున పెంచి వసూలు చేస్తున్నది. ఇంతకుముందు డిసెంబర్ 31న ఒక్కో ఆర్డర్ మీద ప్లాట్ ఫామ్ ఫీజు తాత్కాలికంగా రూ.9లకు పెంచి వసూలు చేసింది.




# జొమాటోలో ప్లాట్‌ఫామ్ ఫీజు పెంపు....!





ప్రముఖ ఫుడ్‌డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమటో ప్లాట్‌ఫామ్ ఫీజును పెంచింది. ఇక నుంచి ప్రతి ఆర్డర్‌పై రూ.5 చొప్పున దీనిని వసూలు చేయనుంది. ఏప్రిల్ 20 నుంచే పెరిగిన ఫీజు అమల్లోకి వచ్చింది. దేశ రాజధాని ప్రాంతం, బెంగళూరు, ముంబయి, హైదరాబాద్, లఖ్‌నవూ వంటి ప్రధాన మార్కెట్లలో ఇప్పటికే యూజర్ల నుంచి దీనిని వసూలు చేస్తోంది. మరో ఫుడ్ డెలివరీ యాప్ స్విగ్గీ ఇప్పటికే ఒక్కో డెలివరీకి రూ.5 చొప్పున వసూలు చేస్తోంది. జొమాటో తొలిసారి 2023 ఆగస్టులో ప్లాట్‌ఫాం ఫీజును ప్రవేశపెట్టింది. తొలుత ఆర్డర్‌కు రూ.2 చొప్పున వసూలు చేసేది. అక్టోబర్‌లో దాన్ని రూ.3, జనవరిలో రూ.4కు పెంచింది. తాజాగా రూ.5కు చేర్చింది. సాధారణంగా ఫుడ్ డెలివరీ సంస్థలు ఆహారంతో పాటు డెలివరీ ఛార్జీని వసూలు చేస్తాయి. కంపెనీ ఆదాయాన్ని పెంచుకోవడానికి ప్లాట్‌ఫామ్ ఫీజును కొత్తగా ప్రవేశపెట్టాయి. జొమాటోకే చెందిన బ్లింకిట్ ఈ ఫీజును రూ.2 చొప్పున వసూలు చేస్తోంది. ప్లాట్‌ఫామ్ ఫీజు పెంపు నేపథ్యంలో జొమాటో షేరు 2.22 శాతం లాభంతో రూ.193.40 వద్ద ముగిసింది. ఇంటర్‌సిటీ లెజెండ్స్ పేరిట ఒక నగరంలో బాగా ప్రాచుర్యం పొందిన ఆహార పదార్థాలను ఇతర నగరాల్లోనూ సరఫరా చేసే సేవలను జొమాటో తాజాగా నిలిపివేసింది.

# ఏఐకి డేటా కంటే విలువైనది ఇదే.. మార్క్ జుకర్‌బర్గ్ అంచనా!




ప్రముఖ టెక్ సంస్థ మెటా ఇటీవల లామా-3 ఏఐ మోడల్స్‌ను విడుదల చేసింది. వాటిని వాట్సప్, మెసెంజర్, ఇన్‌స్టాగ్రామ్‌కు అనుసంధానం చేసింది. ఈసందర్భంగా భవిష్యత్తులో కృత్రిమ మేధ పనితీరును నిర్దేశించబోయే అంశమేంటో సంస్థ సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ వెల్లడించారు. అది డేటా మాత్రం కాదని స్పష్టంచేశారు. "ఏఐ మోడల్‌లో డేటా కంటే ఫీడ్‌బ్యాక్ లూప్‌లు చాలా విలువైనవిగా మారతాయని నా నమ్మకం" అని జుకర్‌బర్గ్ వెల్లడించారు. ఏఐ మోడల్స్‌ను ట్రైన్ చేయడం, మెరుగుపర్చడం కోసం ఫీడ్‌బ్యాక్ లూప్‌లను ఉపయోగిస్తారు. ఇవి గత ఔట్‌పుట్‌ల ఆధారంగా పని చేస్తాయి. తప్పులు జరుగుతున్న సమయంలో ఏఐ మోడల్స్‌కు వాటిని గుర్తు చేసి, అవగాహన కల్పించే అల్గారిథమ్‌లనే లూప్స్‌గా వ్యవహరిస్తారు. పనితీరును మెరుగు పర్చుకోవడానికి కావాల్సిన డేటాను కూడా అవి అందిస్తాయి. ఏఐ మోడల్స్‌ను ఉపయోగించడం, వాటిలోని లోపాలను గుర్తించడం, ఫీడ్‌బ్యాక్ రూపంలో వాటిని అందించి మెరుగుపర్చడమనే ప్రక్రియ భవిష్యత్తులో చాలా విలువైనదిగా మారుతుందని జుకర్‌బర్గ్ వివరించారు. సింథటిక్ డేటా సైతం కీలకపాత్ర పోషిస్తుందని జుకర్‌బర్గ్ అన్నారు. వాస్తవ ప్రపంచంలో ఎదురయ్యే సమస్యల్ని గుర్తించి.. వాటిని పరిష్కరించేందుకు ఉన్న వివిధ పరిష్కార మార్గాలను అన్వేషిస్తారు. వాటిలో ఏది సత్ఫలితాలిస్తుందో కనిపెడతారు. దీనికి సంబంధించిన పూర్తి సమాచారాన్నే సింథటిక్ డేటాగా వ్యవహరిస్తున్నారు. వాస్తవ రూపంలో ఆ సమస్య తలెత్తడం, దాన్ని పరిష్కరించడం జరగకపోయినప్పటికీ.. వాటిని ఊహించుకుని ముందే ఆయా పరిష్కారాలతో ఏఐ మోడల్స్‌కు శిక్షణ ఇవ్వడానికి ఈ సింథటిక్ డేటా ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. చాలా కంపెనీలు ఇప్పుడు దీన్ని అభివృద్ధి చేసే పనిలో ఉన్నాయి.

# హోమ్‌లోన్‌పై టాప్-అప్‌కెళ్తారా....?




గృహ రుణగ్రహీతలకు టాప్-అప్ లోన్స్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇన్‌స్టంట్‌గా, ఈజీగా లభిస్తాయి. తక్కువ వడ్డీరేటుతో, సులభ వాయిదా చెల్లింపుల పద్ధతితో, సౌకర్యవంతంగా ఉండే ఈ రుణాలు.. హోమ్ లోన్ సెగ్మెంట్‌లో ఎంతో పాపులర్. మీరు ఇప్పటికే ఓ గృహ రుణం తీసుకున్నారనుకుందాం. నాలుగైదేండ్లు, అంతకుమించో ఈఎంఐ చెల్లిస్తున్నారు. అయితే మీ ట్రాక్ రికార్డ్ బాగుంటే మీకు రుణాలిచ్చిన సంస్థలు వెంటపడిమరీ టాప్-అప్ లోన్ ఇవ్వడానికి సిద్ధంగా ఉంటాయి. మొబైల్ ఫోన్ రిచార్జ్ చేసుకున్నప్పుడు ఏదైనా ఆఫర్ లేదా సర్వీస్ కోసం టాప్-అప్ రిచార్జ్ చేసుకున్నట్టే ఇదికూడా. ఇప్పటికే ఉన్న గృహ రుణంపై అదనంగా మరో రుణం ఇవ్వడమే టాప్-అప్ లోన్. ఇంటి రినోవేషన్ లేదా కొత్త ఫర్నీచర్ కొనుగోలు, పెయింటింగ్ చేసుకోవడం, హోమ్ ఇంప్రూవ్‌మెంట్ వంటివాటి కోసం ఈ టాప్-అప్ లోన్లకు వెళ్లవచ్చు. దీనికి ప్రత్యేకంగా మరో ఖాతా మొదలవుతుంది. దాని ఈఎంఐ కూడా వేరేగానే ఉంటుంది. ఉదాహరణకు మీరు 15 ఏండ్ల కాలపరిమితితో రూ.30 లక్షల గృహ రుణం తీసుకున్నారనుకుందాం. ఐదేండ్లలో ఈఎంఐల ద్వారా రూ.8 లక్షలు చెల్లించారని లెక్కిద్దాం. ఇప్పుడు మీ లోన్ గడువు ఇంకా పదేండ్లుంది. దీంతో ఇప్పటికే చెల్లించిన రూ.8 లక్షలను మళ్లీ పదేండ్లకుగాను టాప్-అప్ లోన్‌గా రుణదాతలు ఇవ్వవచ్చు. అలాగే పెరిగిన మీ ఆదాయాన్నిబట్టి కూడా టాప్-అప్ లోన్‌ను ఇంకా ఎక్కువే తీసుకోవచ్చు. కానీ మీ వయసుకు లోబడే రుణ కాలపరిమితి ఉంటుంది. అంతేగాక మీ రుణదాత పాలసీ, మీ వ్యక్తిగత స్థోమతనుబట్టి ఎన్నిసార్లైనా ఈ టాప్-అప్ లోన్లు తీసుకోవచ్చు. ఇప్పుడున్న హౌజింగ్ లోన్‌పై పడుతున్న వడ్డీనే దీనికీ వర్తింపజేస్తారు. తక్కువ వడ్డీరేటు కావడం వల్లే చాలామంది వీటికి ఆకర్షితులవుతున్నారు. పర్సనల్ లోన్స్, క్రెడిట్ కార్డ్ రుణాలకు బదులు వీటిని ఎంపిక చేసుకుంటున్నారు. ట్యాక్స్ బెనిఫిట్స్ కూడా ఉండటం మరొక కలిసొచ్చే అంశం. గరిష్ఠంగా రూ.30,000 వరకు ఉంటుంది. కాగా, ఇప్పటికే ఉన్న కస్టమర్ కాబట్టి రుణదాతలు కూడా టాప్-అప్ లోన్లను త్వరితగతినే మంజూరు చేస్తారు. పెద్దగా డాక్యుమెంట్లతో పని ఉండదు. నిధుల వినియోగంపైనా ఆంక్షలుండవు. గృహ రుణంలో మాదిరిగానే నగదు ఉన్నప్పుడు ఈ టాప్-అప్ లోన్‌నూ ముందుగానే తీర్చేయవచ్చు. పైగా ఇటీవలికాలంలో ఓవర్‌డ్రాఫ్ట్ సదుపాయం వచ్చింది. క్రెడిట్ కార్డ్ తరహాలో వాడుకున్న నగదుకు మాత్రమే వడ్డీ చెల్లింపుల్ని చేసుకోవచ్చు. టాప్-అప్ లోన్లను వీలున్నంత తొందరగా తీర్చేసుకుంటే రుణ భారం తగ్గుతుంది. అలాగే దీర్ఘకాలం వడ్డీ భారాన్ని తప్పించుకోవచ్చు. అవసరం ఉన్నంత మేరకే అప్పు తీసుకోవడం ఎంతైనా ఉత్తమం. ఇప్పటికే ఉన్న గృహ రుణంపై అదనంగా మరో రుణం ఇవ్వడమే టాప్-అప్ లోన్. ఇంటి రినోవేషన్ లేదా కొత్త ఫర్నీచర్ కొనుగోలు, పెయింటింగ్ చేసుకోవడం, హోమ్ ఇంప్రూవ్‌మెంట్ వంటివాటి కోసం ఈ టాప్-అప్ లోన్లకు వెళ్లవచ్చు. దీనికి ప్రత్యేకంగా మరో ఖాతా మొదలవుతుంది.

# నో కాస్ట్ ఈఎంఐతో లాభం అనుకుంటున్నారా? అసలు లెక్క తెలిస్తే షాకే



ఇటీవల కాలంలో ఏ వస్తువు కొనుగోలు చేయాలన్నా అందరూ వినియోగిస్తున్న విధానం నో కాస్ట్ ఈఎంఐ. ఇది వినియోగదారులకు ఎక్కువ వెసులుబాటును కలుగజేస్తుండటంతో అందరూ దీనిని ఎంచుకుంటున్నారు. ఇది వ్యక్తుల ఆర్థిక స్థితిపై ఒత్తిడి లేకుండా చేస్తుంది. నెలవారీ సులభవాయిదాలలో అసలు మొత్తం చెల్లించే అవకాశాన్ని అందిస్తుంది. పైగా ప్రతి నెల ఎంత చెల్లించాలో ముందే కొనుగోలుదారులకు అవగాహన ఉంటుంది కాబట్టి వారి నెలవారీ బడ్జెట్ ను దానికనుగుణంగా రూపొందించుకోడానికి ఇది అవకాశం కల్పిస్తుంది. ఈ నో కాస్ట్ ఈఎంఐ పథకం మంచి ప్రయోజనాలు అందిస్తున్నప్పటికీ, వినియోగదారులు వాటిని ఎంచుకునే ముందు జాగ్రత్త వహించాలి. ఈ పథకం నిబంధనలు, షరతులను జాగ్రత్తగా సమీక్షించుకోవాలి. ఎందుకంటే కొన్ని సందర్భాల్లో ప్రాసెసింగ్ ఫీజులు, అడ్మినిస్ట్రేషన్ చార్జీల వంటి కొన్ని హిడెన్ చార్జీలు ఉండే అవకాశం. ఇది మీపై అదనపు భారం కాగలదు. ఈ నేపథ్యంలో అసలు నో కాస్ట్ ఈఎంఐ అంటే ఏమిటి? అది ఎలా పనిచేస్తుంది? దానిని తీసుకునే ముందు పాటించవలసిన జాగ్రత్తలు ఏమిటి? తెలుసుకుందాం రండి. నో-కాస్ట్ ఈఎంఐ అంటే.. దీనిని జీరో-కాస్ట్ ఈఎంఐ అని కూడా పిలుస్తారు. వినియోగదారులు రుణంపై ఎలాంటి వడ్డీని చెల్లించకుండా వస్తువులు లేదా సేవలను కొనుగోలు చేయడానికి ఇది అనుమతిస్తుంది. వడ్డీ ధరను అమ్మకందారులు ఈఎంఐ స్కీమ్‌ను అందించే బ్యాంక్ ద్వారా స్వీకరిస్తుంది. దీంతో వినియోగదారుడు కేవలం తాను కొనుగోలు చేసే వస్తువు వాస్తవ ధరను మాత్రమే చెల్లిస్తారు. దీని వల్ల వారిపై అదనపు వడ్డీ భారం తగ్గుతుంది.


# రిలయన్స్ లాభాల్లో 2 శాతం తగ్గుదల...!

**న్యూఢిల్లీ :** ముకేష్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) లాభాలు తగ్గాయి. గడిచిన ఆర్థిక సంవత్సరం (2023-24)లోని మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో 18,951 కోట్ల నికర లాభాలు నమోదు చేసింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.19,299 కోట్ల నికర లాభాలు సాధించింది. దీంతో పోల్చితే గడిచిన క్యూ4 లాభాల్లో 1.8 శాతం తగ్గుదల చోటు చేసుకుంది. కాగా.. కంపెనీ రెవెన్యూ 11.3 శాతం పెరిగి రూ.2,40,715 కోట్లకు చేరింది. కంపెనీ మొత్తం వ్యయాలు 11.45 శాతం పెరిగి రూ.2,17,529 కోట్లుగా నమోదయ్యాయి. ఆర్ఐఎల్ 2023-24కు గాను రెండో సారి డివిడెండ్‌ను ప్రకటించింది. ప్రతీ ఈక్విటీ షేర్‌పై రూ.10 డివిడెండ్ చెల్లింపునకు ఆ కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది. ఇంతక్రితం రూ.9 డివిడెండ్‌ను చెల్లించింది. ఆర్థిక సంవత్సరం 2023-24లో మొత్తంగా 2.6 శాతం వృద్ధితో రూ.9,14,472 కోట్ల రెవెన్యూ ప్రకటించింది. ఇంతక్రితం ఏడాదిలో రూ.8.91 లక్షల కోట్ల రెవెన్యూ నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.8.09 కోట్లుగా ఉన్న వ్యయాలు.. గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ.9.14 లక్షల కోట్లకు పెరిగాయి. 2023-24లో రూ.79,020 కోట్ల నికర లాభాలు నమోదయ్యాయి. ఇంతక్రితం ఏడాది రూ.73,670 కోట్ల లాభాలు ఆర్జించింది. 2023-24 మార్చితో ముగిసిన త్రైమాసికంలో రిలయన్స్




జియో 13.2 శాతం పెరిగి రూ.5,337 కోట్లకు చేరాయి. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ4లో రూ.4,716 కోట్ల లాభాలు నమోదు చేసింది. గడిచిన క్యూ4లో కంపెనీ రెవెన్యూ 11 శాతం పెరిగి రూ.25,394 కోట్లుగా చోటు చేసుకుంది. 2023-24లో జియో స్థూల రెవెన్యూ 10.4శాతం పెరిగి రూ.1 లక్ష కోట్లను చేరగా.. నికర లాభాలు 11.48 శాతం పెరిగి రూ.20,607 కోట్లుగా నమోదయ్యాయి. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.19,299 కోట్ల నికర లాభాలు సాధించింది. దీంతో పోల్చితే గడిచిన క్యూ4 లాభాల్లో 1.8 శాతం తగ్గుదల చోటు చేసుకుంది. కాగా.. కంపెనీ రెవెన్యూ 11.3 శాతం పెరిగి రూ.2,40,715 కోట్లకు చేరింది.

# రాణించిన సూచీలు.. 22,300 ఎగువకు నిఫ్టీ



**ముంబయి :** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలతో మన సూచీలూ రాణించాయి. ముఖ్యంగా ప్రైవేటు బ్యాంకులు, ఇన్‌ఫ్రా స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు సూచీలకు కలిసొచ్చింది. దీంతో సూచీలు వరుసగా రెండోరోజూ రాణించాయి. సెన్సెక్స్ 560 పాయింట్లు లాభపడగా.. నిఫ్టీ 22,300 పాయింట్ల ఎగువన ముగిసింది. సెన్సెక్స్ ఉదయం 73,666.51 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఆద్యంతం అదే ఒరవడిని కొనసాగించింది. ఇంట్రాడేలో 73,227.32 - 73,767.80 మధ్య కదలాడిన సూచీ.. 560.29 పాయింట్లు లాభపడి 73,648.62 వద్ద ముగిసింది. నిఫ్టీ 189.40 పాయింట్లు లాభపడి 22,336.40 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 83.36గా ఉంది. సెన్సెక్స్‌లో ఎల్అండ్‌టీ, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, అల్ట్రాటెక్ సిమెంట్, విప్రో షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. ఎన్టీపీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఇండస్ ఇండ్ బ్యాంక్, టాటా స్టీల్ ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ రకం బ్యారెల్ చమురు ధర 86.74 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

గరుడ వార్త

గురువారం, ఏప్రిల్ 25, 2024

# ఎన్నికలను మేం నియంత్రించలేం

న్యూఢిల్లీ : ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్లో నమోదైన ఓట్లతో100 శాతం వీవీ ప్యాట్ల స్లిప్పులను సరిపోల్చి లెక్కించాలన్న పిటిషన్లపై సుప్రీం కోర్టు తీర్పును రిజర్వు చేసింది. ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియను నియంత్రించే అధికారం తమకు లేదని న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. రాజ్యాంగ సంస్థ అయిన ఎన్నికల సంఘం పనితీరును తాము నిర్దేశించలేమని వెల్లడించింది. ఎన్నికల కౌంటింగ్ సమయంలో ఈవీఎం ఓట్లతో వీవీ ప్యాట్ స్లిప్పులను క్రాస్ వెరిఫై చేయాలంటూ దాఖలైన పిటిషన్లపై సుప్రీం కోర్టు బుధవారం మరోసారి విచారణ జరిపింది. వాస్తవానికి దీనిపై జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం బుధవారం తీర్పు వెలువరించాల్సి ఉంది. అయితే ఈ అంశంలో ఇంకా తమకు సందేహాలు ఉండటంతో ధర్మాసనం స్పష్టత కోరింది. ఈ క్రమం లోనే కేంద్ర ఎన్నికల సంఘానికి కొన్ని ప్రశ్నలు సంధించింది. ఈవీఎంలో మైక్రో కంట్రోలర్ ఎక్కడ ఉంటుంది. కంట్రోలింగ్ యూనిట్ లోనా లేదా వీవీ ప్యాట్ లోనే ? అని ప్రశ్నించింది. మైక్రో కంట్రోలర్ అనేది ఒకసారి రూపొందించిన ప్రోగ్రామా , కాదా ?అన్నది నిర్ధారించాలని సూచించింది. కోర్టు ఆదేశాల మేరకు ఈ మధ్యాహ్నం ఈసీ అధికారులు న్యాయస్థానం ఎదుట హాజరై వివరణ ఇచ్చారు. ఎన్నికల సంఘం వివరణను పరిశీలించిన ధర్మాసనం తీర్పును రిజర్వు చేసింది. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. " మా సందేహాలను ఈసీ నివృత్తి చేసింది. మీ (పిటిషనర్ ) ఆలోచనా ధోరణిని మేం మార్చలేం. కేవలం అనుమానాలను ఆధారం చేసుకుని ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేం. ఎన్నికల సంఘం ఓ రాజ్యాంగ సంస్థ . దాని తీరును మేం నిర్దేశించలేం. ఎన్నికల ప్రక్రియను నియంత్రించలేం." అని స్పష్టం చేసింది. ఈ విచారణ సందర్భంగా ఈవీఎం సోర్స్ కోడ్‌కు సంబంధించిన అంశాలను పిటిషనర్లు లేవనెత్తారు. పారదర్శకత కోసం దాన్ని బయటపెట్టాలని కోరారు. దీన్ని ధర్మాసనం వ్యతిరేకించింది. " సోర్స్ కోడ్‌ను ఎప్పుడూ బహిర్గతం చేయకూడదు. ఇలా చేస్తే దాన్ని దుర్వినియోగం చేసే అవకాశం ఉంది " అని వ్యాఖ్యానించింది. ప్రస్తుతం ఓ అసెంబ్లీ స్థానంలో ఐదు ఈవీఎంల లోని ఓట్లను వీవీ ప్యాట్ స్లిప్పులతో వెరిఫై చేస్తున్నారు. అలా కాకుండా మొత్తం స్లిప్పులను సరిపోల్చాలని పిటిషనర్లు డిమాండ్ చేస్తున్నారు. అయితే ఈసీ మాత్రం అది సులభం కాదని చెబుతోంది. ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసే అవకాశం లేదని కోర్టుకు వివరించింది.

# కెసిఆర్ ఎన్నడూ భయపడలేదు



మిర్యాలగూడ : భారత రాష్ట్ర సమితి అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు బస్సు యాత్ర కొనసాగుతోంది. మిర్యాలగూడ రోడ్ షోలో కెసిఆర్ బుధవారం సాయంత్రం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ సిఎం కెసిఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. రైతుబంధులో దగా.. రైతుబీమా ఉంటుందో.. ఊడుతుందో తెలియదన్నారు. బిఆర్ఎస్ హయాంలో రెప్పపాటు కూడా విద్యుత్ పోలే.. బిఆర్ఎస్ హయాంలో మిగులు విద్యుత్ ఉండేలా చేశామన్నారు. మిషన్ భగీరథను సరిగా నడపలేని పరిస్థితి ఈ ప్రభుత్వానిదని కెసిఆర్ మండిపడ్డారు. రైతుబంధు ఇవ్వాలని కోరితే చెప్పుతో కొడతానని ఓ మంత్రి చెప్పారు. చెప్పులు మంత్రి దగ్గరనే కాదు రైతుల దగ్గర కూడా ఉంటాయని హితువు పలికారు. ప్రాజెక్టులను కెఆర్ఎంబికి అప్పగించారు. సాగర్ ఆయకట్ట కింద పంటలను ఎండపెట్టారని ధ్వజమెత్తారు. నన్న తిట్టి పబ్బం గడుపుకోవడే మంత్రుల పని అన్నారు. రైతులకు ఏటా బడ్జెట్ లో రూ. 15 వేల కోట్లు పెట్టామని కెసిఆర్ గుర్తుచేశారు. మద్దతు ధరకు పంటలు కొని రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశామని కెసిఆర్ వెల్లడించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ ను గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. బిఆర్ఎస్ గెలిస్తే ప్రభుత్వం మెడలు వంచి అన్ని పనులు చేపడతామని పేర్కొన్నారు. కెసిఆర్ ఆనవాళ్ల లేకుండా చేస్తామంటున్నారు.. జైలుకు వెళ్లేందుకు కెసిఆర్ ఎన్నడూ భయపడలేదని హెచ్చరించారు. కెసిఆర్ భయపడితే తెలంగాణ వచ్చేదా?.. బోగస్ మాటలతో ఆరు హామాలకు పంగనామం పెట్టారని ఎద్దేవా చేశారు.

# పేలుడులో దెబ్బతిన్న మణిపూర్ వంతెన

ఇంఫాల్ : మణిపూర్ లోని ఇంఫాల్, నాగాలాండ్ లోని దిమాపూర్‌లను కలిపే వంతెన బుధవారం తెల్లవారు జామున మందుగుండు పదార్థాల పేలుడులో దెబ్బతింది. వంతెన మధ్య మూడు గుంతలు పడగా, రెండు చివర్లలో పగుళ్లు ఏర్పడ్డాయి. సపెర్‌మెయినా, కౌబ్రులెయిఖా ప్రాంతాల మధ్యన ఈ ప్రమాదం జరిగింది. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. బ్రిడ్జికి రెండు వైపుల చివరన పదార్థాలను గుర్తించారు. వంతెనపై భారీ వాహనాల రాకపోకలను ఆపివేశారు. పేలుడు తరువాత పోలీస్ అధికారులు ఆ ప్రాంతానికి తరలివెళ్లారు. బ్రిడ్జి చుట్టూ దిగ్బంధం చేశారు. దీనిపై దర్యాప్తు చేపట్టారు. ఇంఫాల్ పశ్చిమ జిల్లాలో రెండు వర్గాలకు చెందిన వాలంటీర్ల మధ్య తుపాకీ కాల్పులు చోటు చేసుకున్న తరువాత కొన్ని గంటలకు బ్రిడ్జి పేలుడుకు గురైంది. అంతకు ముందు బ్రిడ్జిపై బుధవారం ఉదయం రెండు వీలర్లు వెళ్లినట్టు తెలిసింది.



# దంతెవాడలో 18 మంది నక్సల్స్ లొంగుబాటు



దంతెవాడ: ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడలో బుధవారం 18 మంది నక్సలైట్లు లొంగిపోయారు. లొంగిపోయిన నక్సల్స్‌లో ఒక మిలిషియా ప్లాటూన్ సెక్షన్ కమాండ్, ముగ్గురు మహిళలు ఉన్నట్లు దంతెవాడ ఎస్పి గౌరవ్ రాయ్ తెలిపారు. హుర్రేపాల్ పంచాయత్ మిలిషియా ప్లాటూన్ సెక్షన్ కమాండర్‌గా పనిచేస్తున్న హిడ్మా ఓయం(34)తోపాటు అదే సెక్షన్‌లో డిప్యూటీ కమాండర్‌గా పనిచేస్తున్న సంబటి ఓయం(23), నిషిద్ధ మావోయిస్టు పార్టీ కాకడి పంచాయత్ క్రాంతికారి మహిళా ఆదివాసి సంఘటన్ ఉపాధ్యక్షురాలు గంగి మడ్కం(23), హుర్రేపాల్ పంచాయత్ సభ్యురాలు హంగి ఓయం(20) లొంగిపోయిన నక్సలైట్లలో ఉన్నారు. పోలీసులు, సిఆర్‌పిఎఫ్ అధికారుల ఎదుట 18 మంది నక్సల్స్ తమ ఆయుధాలు అప్పగించి లొంగిపోయారని ఎస్‌పి చెప్పారు. దక్షిణ బస్తర్‌లోని మావోయిస్టులకు చెందిన భైరంగఢ్, మలంగెర్ ఏరియా కమిటీలలో వీరంతా పనిచేస్తున్నారని ఆయన చెప్పారు. మావోయిస్టుల సిద్ధాంతంలో నిస్పృహ చెంది వారంతా తమకు తాముగా లొంగిపోయారని, వారికి పునరావాస ప్యాకేజీ కల్పిస్తామని ఆయన తెలిపారు. దీంతో ఇప్పటి వరకు దంతెవాడ జిల్లాలో (738 మంది నక్సలైట్లు ప్రధాన జీవన స్రవంతిలో కలిశారని ఆయన తెలిపారు. వీరిలో 177 మందిపై రివార్డులు కూడా ఉన్నట్లు ఆయన చెప్పారు.

# ఎన్నికలను మేం నియంత్రించలేం

న్యూఢిల్లీ : ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్లో నమోదైన ఓట్లతో100 శాతం వీవీ ప్యాట్ల స్లిప్పులను సరిపోల్చి లెక్కించాలన్న పిటిషన్లపై సుప్రీం కోర్టు తీర్పును రిజర్వు చేసింది. ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియను నియంత్రించే అధికారం తమకు లేదని న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. రాజ్యాంగ సంస్థ అయిన ఎన్నికల సంఘం పనితీరును తాము నిర్దేశించలేమని వెల్లడించింది. ఎన్నికల కౌంటింగ్ సమయంలో ఈవీఎం ఓట్లతో వీవీ ప్యాట్ స్లిప్పులను క్రాస్ వెరిఫై చేయాలంటూ దాఖలైన పిటిషన్లపై సుప్రీం కోర్టు బుధవారం మరోసారి విచారణ జరిపింది. వాస్తవానికి దీనిపై జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం బుధవారం తీర్పు వెలువరించాల్సి ఉంది. అయితే ఈ అంశంలో ఇంకా తమకు సందేహాలు ఉండటంతో ధర్మాసనం స్పష్టత కోరింది. ఈ క్రమం లోనే కేంద్ర ఎన్నికల సంఘానికి కొన్ని ప్రశ్నలు సంధించింది. ఈవీఎంలో మైక్రో కంట్రోలర్ ఎక్కడ ఉంటుంది. కంట్రోలింగ్ యూనిట్ లోనా లేదా వీవీ ప్యాట్ లోనే ? అని ప్రశ్నించింది. మైక్రో కంట్రోలర్ అనేది ఒకసారి రూపొందించిన ప్రోగ్రామా , కాదా ?అన్నది నిర్ధారించాలని సూచించింది. కోర్టు ఆదేశాల మేరకు ఈ మధ్యాహ్నం ఈసీ అధికారులు న్యాయస్థానం ఎదుట హాజరై వివరణ ఇచ్చారు. ఎన్నికల సంఘం వివరణను పరిశీలించిన ధర్మాసనం తీర్పును రిజర్వు చేసింది. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. " మా సందేహాలను ఈసీ నివృత్తి చేసింది. మీ (పిటిషనర్ ) ఆలోచనా ధోరణిని మేం మార్చలేం. కేవలం అనుమానాలను ఆధారం చేసుకుని ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేం. ఎన్నికల సంఘం ఓ రాజ్యాంగ సంస్థ . దాని తీరును మేం నిర్దేశించలేం. ఎన్నికల ప్రక్రియను నియంత్రించలేం." అని స్పష్టం చేసింది. ఈ విచారణ సందర్భంగా ఈవీఎం సోర్స్ కోడ్‌కు సంబంధించిన అంశాలను పిటిషనర్లు లేవనెత్తారు. పారదర్శకత కోసం దాన్ని బయటపెట్టాలని కోరారు. దీన్ని ధర్మాసనం వ్యతిరేకించింది. " సోర్స్ కోడ్‌ను ఎప్పుడూ బహిర్గతం చేయకూడదు. ఇలా చేస్తే దాన్ని దుర్వినియోగం చేసే అవకాశం ఉంది " అని వ్యాఖ్యానించింది. ప్రస్తుతం ఓ అసెంబ్లీ స్థానంలో ఐదు ఈవీఎంల లోని ఓట్లను వీవీ ప్యాట్ స్లిప్పులతో వెరిఫై చేస్తున్నారు. అలా కాకుండా మొత్తం స్లిప్పులను సరిపోల్చాలని పిటిషనర్లు డిమాండ్ చేస్తున్నారు. అయితే ఈసీ మాత్రం అది సులభం కాదని చెబుతోంది. ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసే అవకాశం లేదని కోర్టుకు వివరించింది.



# కెసిఆర్ రాష్ట్రాన్ని పదేళ్లపాటు అభివృద్ధి చేస్తే రేవంత్ రెడ్డి వందరోజుల అబద్ధాల పాలన కొనసాగిస్తుండు

- వలస పక్షులకు ఓట్లు వేస్తే గెలిచిన తర్వాత మళ్లీ కనిపించరు
- స్థానికంగా ఉండే రాగిడి లక్ష్మారెడ్డి కి ఓటేస్తే మీకు ఎప్పుడు అందుబాటులో ఉంటారు
- దేశంలో బడాబాయ్ మోడీ అయితే, రాష్ట్రంలో చోటాభై రేవంత్ రెడ్డి
- దొంగల మైసమ్మ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్ షో నిర్వహించిన కేటీఆర్
- మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి తో కలిసి బిఆర్ఎస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి నామినేషన్ వేశారు








**శామీర్ పేట, (గరుడ వార్త) :** కెసిఆర్ రాష్ట్రాన్ని పదేళ్లపాటు అభివృద్ధి చేస్తే రేవంత్ రెడ్డి 100 రోజుల అబద్ధాలు పాలన చేస్తుండంటూ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. బుధవారం శామీర్ పేట మండలం దొంగల మైసమ్మ చౌరస్తాలో మల్కాజ్గిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిరి లక్ష్మారెడ్డి కి మద్దతుగా ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ వలస పక్షులకు ఓట్లు వేస్తే గెలిచిన తర్వాత కనిపించకుండా పోతారన్నారు. దేశంలో బడాబాయ్ మోడీ అని, రాష్ట్రంలో చోటాబాయ్ రేవంత్ రెడ్డి అని విమర్శించారు. దేవుళ్ళ పేరుతో అబద్ధాలు చెప్పుకుంటూ రాజకీయం చేస్తున్న బిజెపిని ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో తొక్కుతామని చెప్పారు. మోడీ, రేవంత్ లు ఇద్దరు పెద్ద మోసగాళ్ళని, ఎన్నికల వాగ్దానాలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యారని మండిపడ్డారు. గడిచిన పదేళ్లలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి ఏమి చేసిందని, ఓట్లు వేసి ఎలా గెలిపిస్తారని ఆయన ప్రశ్నించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో హైదరాబాద్లో 36 ఫ్లైఓవర్లను నిర్మించి పూర్తి చేయగా, కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఉప్పల్ అంబర్ పేట లో రెండే రెండు ఫ్లైఓవర్లను మంజూరు చేసి వాటిని పూర్తి చేయలేక నత్తనడకన నడిపిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తానని రేవంత్ రెడ్డి గద్దెనెక్కి చేసిన పచ్చి మోసాన్ని ప్రజలు గమనించాలని కోరారు. రాష్ట్రంలో ఎక్కడకు వెళితే అక్కడ రేవంత్ రెడ్డి దేవుళ్ళ మీద ఒట్టు వేసి రుణమాఫీ చేస్తానని మోసాలకు పాల్పడుతున్నట్లు ఆయన మండిపడ్డారు. ఒక్కసారి మోసపోతే మోసం చేసిన వాడిదే తప్పు, రెండోసారి మోసపోతే మోసపోయిన వాడిది తప్పు అవుతుందని చెప్పారు. ఇప్పుడు రాష్ట్రంలో ప్రజలంతా కేసీఆర్ ని గుర్తు చేసుకుంటున్నారని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాదులో ప్రజలంతా బీఆర్ఎస్ కే పట్టం కట్టారని, ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకే ఓట్లు వేసి గెలిపించాలని ఆయన ఓటర్లను కోరారు. శ్రీరామునితో మనకు ఎలాంటి పంచాయతీ లేదని, శ్రీరాముడు లంగాలు, దొంగలను గెలిపించమని చెప్పరని ఆయన అన్నారు. దేశంలో మోడీ అక్షింతలు పంపిస్తే, కేసీఆర్ తినడానికి బియ్యం పంపించారని తెలిపారు. మల్కాజ్గిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి ప్రజలు కష్టాలు తెలిసిన నాయకుడని, మీరందరూ ఆయనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మల్కాజ్గిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మీ కుటుంబ సభ్యుడిగా నన్ను మీరందరూ ఆశీర్వదించి ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, లక్ష్మారెడ్డి, వివేక్ గౌడ్, రాజశేఖర్ రెడ్డి, ఎమ్మెల్సీలు శంబిపూర్ రాజు, సురభి వానిదేవి, దయానంద్ గుప్తా, బి ఆర్ ఎస్ నాయకులు జహంగీర్, భాస్కర్ యాదవ్, నంది కంటి శ్రీధర్, మేయర్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ఎంపీపీలు, జడ్పిటిసిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రూ.25 వేల కోట్ల స్కామ్ కేసులో సునేత్ర పవార్‌కు క్లీన్ చిట్



ముంబై : లోక్‌సభ ఎన్నికల సమయంలో మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. రూ. 25 వేల కోట్ల విలువైన కోఆపరేటివ్ బ్యాంక్ కుంభకోణం కేసులో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ సతీమణి, బారామతి ఎన్డీయే అభ్యర్థి సునేత్ర పవార్‌కు భారీ ఊరట లభించింది. ఈ కేసులో ఆమెకు పోలీస్‌లు క్లీన్‌చిట్ ఇచ్చారు. మహారాష్ట్ర స్టేట్ కోఆపరేటివ్ బ్యాంకులో జరిగిన స్కామ్‌కు సంబంధించిన కేసు దర్యాప్తును ముంబై పోలీస్ ఆర్థిక నేరాల విభాగం చేపట్టింది. ఈ ఏడాది జనవరిలో ముంబై పోలీస్‌లు క్లోజర్ రిపోర్టు దాఖలు చేశారు. అయితే అందులోని వివరాలు తాజాగా బయటికొచ్చాయి. ఇందులో సునేత్ర పవార్, ఆమె భర్త అజిత్‌కు సంబంధించిన లావాదేవీల్లో ఎలాంటి అవకతవకలు జరగలేదని తాము గుర్తించినట్టు పోలీస్‌లు పేర్కొన్నారు. అజిత్‌కు చెందిన జరందేశ్వర్ షుగర్‌మిల్‌కు జారీ చేసిన రుణాల విషయంలో బ్యాంకుకు ఎలాంటి నష్టం జరగలేదని నివేదికలో తెలిపారు. లోక్‌సభ ఎన్నికల వేళ ఈ నివేదిక బయటికి రావడంతో మహారాష్ట్ర ప్రభుత్వం , బీజేపీపైనా విపక్షాలు భగ్గుమన్నాయి. " ఈ కుంభకోణం గురించి గతంలో మోడీ మాట్లాడుతూ పవార్ కుటుంబం మొత్తం అవినీతిపరులని ఆరోపించారు. ఇప్పుడు వారు పార్టీ మారగానే పోలీసులు సునేత్ర పవార్‌కు క్లీన్‌చిట్ ఇచ్చారు. అంటే బీజేపీపై వాషింగ్ పౌడర్ వ్యాఖ్యలు నిజమేనని మరోసారి రుజువైంది. " అని శివసేన యూబీటీ నేత ఆనంద్ దూబే ఆరోపించారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్, ఝూర?ండ్ మాజీ సిఎం హేమంత్ సోరెన్‌ల గురించి ప్రస్తావిస్తూ వారుముఖ్యమంత్రులైనా సరే బీజేపీకి వ్యతిరేకులు కాబట్టి కేసులు , అరెస్టులు ఉంటాయని, బీజేపీలో చేరితే మంత్రులు,, డిప్యూటీ ముఖ్యమంత్రులై పోతారని ఎంపీ టికెట్లు కూడా ఇస్తారని దూబే వ్యాఖ్యానించారు. ఈ విషయాన్ని ఎత్తి చూపి వ్యతిరేకిస్తే బీజేపీ చాలా ఆందోళన, ఆవేదన పాలై పోతుందని విమర్శించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను బీజేపీ తమ చెప్పుచేతల్లో పెట్టుకుంటుందని, విపక్షాలపై దాడికి, అరెస్టులకు పాల్పడుతుందని, ఎవరైనా పార్టీ మారి బిజేపీలో చేరితే కేసుల దర్యాప్తు మందకొడై చివరకు క్లీన్ చిట్ లభిస్తుందని విపక్షాలు పదేపదే విపక్షాలు చేసిన విమర్శలకు ఈ క్లీన్‌చిట్ ఆయుధంగా మారింది. విపక్షాలు దీన్ని బిజేపి వాషింగ్ మెషిన్‌గా వ్యాఖ్యానిస్తున్నారు. తాజా ఎన్నికల్లో సునేత్ర పవార్ ఎన్డీయే తరఫున బారామతి స్థానం నుంచి పోటీ చేస్తున్న సంగతి తెలిసిందే. శరద్ పవార్ కంచుకోట అయిన ఈ నియోజకవర్గానికి ప్రస్తుతం ఆయన కుమార్తె సుప్రియా సూలే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. తాజా ఎన్నికల్లోనూ ఆమె మరోసారి బరిలోకి దిగుతున్నారు. దీంతో బారామతిలో ఈ వదినా మరదళ్ల సవాల్ దేశ వ్యాప్తంగా ఆసక్తిగా మారింది. బారామతి పార్లమెంట్ నియోజకవర్గానికి మూడవ దశలో మే 7న పోలింగ్ జరుగుతుంది. జూన్ 4న ఫలితాలు వెలువడుతాయి.

Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301.
and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V**, **RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com